J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 43 సంచిక : 27 08.12.2023, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## తెలంగాణ తీర్పుతో...

# జగన్ జాగ్రత్త పడతారా?



### కేసీఆర్ రాజకీయానికి చరమగీతం

### నియంతృత్వ పోకడలకు చెల్లు చీటీ

**పదేళ్ల క్రితం ప్రత్యేక రాష్ట్రంగా అవతరించిన తెలంగాణ రాష్ట్రంలో, ఓటర్లు తెలంగాణ రాజకీయ చరిత్ర గమనాన్ని ఓ మలుపు తిప్పారు. గత పదేళ్ళుగా కొనసాగిన నియంతృత్వ పోకడని భూస్థాపితం చేశారు. కేసీఆర్‌ను వదిలించేసుకున్నారు.**

ఇరవై ఏళ్ళ క్రితం కే.చంద్రశేఖరరావు అనే ఒక తెలుగుదేశం పార్టీ నాయకుడు వెంట్రుకతో "ప్రత్యేక తెలంగాణ" అనే కొండకు ముడివేసి లాగారు. పోతే, వెంట్రుక పోతుంది. వస్తే కొండ వస్తుంది. మనకు నష్టం ఏముందని అనుకున్నారు. ఆయన అదృష్టం కలిసొచ్చి కొండే వచ్చింది. తెలంగాణ ఏర్పాటయింది. "ప్రత్యేక తెలంగాణ" అనే అంశాన్ని ఒక భావోద్వేగ అంశంగా మార్చుకుని దశాబ్దకాలంగా అధికారహోదాలో రాజకీయం చేస్తూవచ్చిన కేసీఆర్ అనబడే కల్వకుంట్ల చంద్రశేఖర రావుకి మీ సేవలకు ఓ నమస్కారం అంటూ ఆయన శేష జీవితాన్ని తెలంగాణ ప్రజలు ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశారు. ఆయన పెట్టిన పార్టీ భవిష్యత్ ఎలా ఉండబోతోందో వేచిచూడాలి.

తెలంగాణలో కాంగ్రెస్ గెలిచింది అనేదానికంటే, కేసీఆర్ కథ కంచికి వెళ్ళింది అనడం సముచితం అంటున్నారు తెలంగాణ విశ్లేషకులు.

తెలంగాణలో గత పదేళ్లుగా బంధు మిత్ర సపరివార సమేతంగా అధికారంలో మునిగితేలుతున్న కేసీఆర్‌ను, ఆయన రాజకీయపార్టీని ఓటర్లు నిర్ద్వందంగా తిరస్కరించారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్నప్పటికీ, కేసీఆర్‌నే ఓడించారు. ప్రజలు ఒక్కసారి అసంతృప్తికిలోనైతే.. ముఖ్యమంత్రి అయినా, ఆయన బాబు అయినా తమకు తేడా ఏమీ ఉండదని అక్కడి ఓటర్లు నిరూపించారు.

కేసీఆర్‌ను, ఆయన పార్టీని ఓటర్లు మట్టి కరిపించిన తీరు నుంచి ఇతర రాష్ట్రాల పాలకపక్షాలు నేర్చుకోవలసిన అంశాలు అనేకం కనిపిస్తున్నాయని పరిశీలకులు అంటున్నారు. అందులోనూ, తెలంగాణ ఎన్నికల ఫలితాల ప్రభావం ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై అనివార్యంగా ఉంటుందనే భావన జనంలో సైతం గట్టిగానే ఉంది. మరో మూడు, నాలుగు నెలల్లో ఎన్నికలు జరగవలసి ఉన్న ఆంధ్ర ప్రదేశ్‌లో.. తెలంగాణ ఫలితాల ప్రభావం ఎంత? రెండోసారి, 175కి 175 స్థానాలతో అధికారంలోకి రావాలని గట్టి ప్రయత్నాలు చేస్తున్న జగన్, కేసీఆర్ అనుభవాల నుంచి జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఏమైనా ఉందా?! అన్న ప్రశ్నలు ఇప్పుడు రాజకీయవర్గాలలో చక్కర్లు కొడుతున్నాయి.

ఇందుకు కారణాలు కూడా లేక పోలేదు. సీమాంధ్ర, తెలంగాణ దాదాపు 60 ఏళ్ళ పాటు ఒకే రాష్ట్రంగా ఉండడంతో, 2014 వరకూ అవిభక్త కవలల్లా ఈ రెండు రాష్ట్రాలూ పెనవేసుకుపోయి ఉన్నాయి.

ఆంధ్రకు చెందిన నాయకులు, వినాయకులు, ఉప నాయకులు, కాంట్రాక్టర్లు, ఉన్నతోద్యోగులు, అధికారంలో ఉన్నవారు, లేనివారిలో 90శాతానికి తక్కువ లేకుండా అందరి వ్యాపారాలు, పరిశ్రమలు, అయిదు నక్షత్రాల ఆతిథ్య సముదాయాలు, రియల్ ఎస్టేటు వ్యాపకాలు, ఫార్మా కంపెనీలూ మొదలైనవన్నీ హైదరాబాద్, దాని చుట్టుపక్కలా ఉన్నాయన్నది అందరికీ తెలిసిన విషయమే. అందుకే, తెలంగాణలో "ఫ్రెండ్లీ ప్రభుత్వ సారధులు" ఉండాలని ఆంధ్రలో రాజకీయ నాయకులతో పాటు, ఏ రంగంలో చక్రం తిప్పేవారైనా కోరుకుంటారు.

ఆంధ్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మొన్నటివరకు తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ "అజ్ఞాత" మిత్రుడుగా ఉన్నారనే భావం రెండు రాష్ట్రాల్లోనూ గట్టిగానే ఉంది.

ఇప్పుడు కేసీఆర్ కథ దాదాపుగా సమాప్త దశకు చేరుకోవడంతో, వైసీపీలో కొంత ఆందోళన నెలకొన్న సూచనలు కనిపిస్తున్నాయి. అదే సమయంలో, కేసీఆర్ కథ కంచికి చేరడం పట్ల తెలుగుదేశం పార్టీలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అందులోనూ తెలంగాణలో ఇప్పుడు పాలకపగ్గాలు చేపట్టింది... చంద్రబాబు ప్రియ అనుయాయుడుగా రాజకీయాల్లో ఎదిగిన రేవంత్‌రెడ్డి. దీంతో గత అయిదేళ్లుగా జగన్, ఆయన బృందానికి అందుతుందని జనం అనుకుంటున్న ప్రత్యక్ష, పరోక్ష సహాయసహకారాలు ఇక ముందు అందే అవకాశాలు లేవని ఒక పరిశీలకుడు అభిప్రాయపడ్డారు.

అది నిజమయ్యే పక్షంలో ఆంధ్రాలోని అధికారపార్టీలో చాలామంది నాయకులు, వారి బినామీలు ఇబ్బందిపడే పరిస్థితి రావచ్చు. అదే సమయంలో తెలుగుదేశం పార్టీకి, చంద్రబాబునాయుడికి తెలంగాణ కొత్త ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దన్నుగా నిలబడే అవకాశాలు కూడా పుష్కళంగా ఉన్నాయని అంటున్నారు.

గత ఎన్నికల్లో, అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్... జగన్‌కు అండగా నిలబడడంతో పాటు, చంద్రబాబుకి తెలంగాణ నుంచి ఎటువంటి ఆర్థిక సహాయాలు అందకుండా కట్టడి చేశారనే వార్తలు కూడా అప్పట్లో బాగా ప్రచారంలోకి వచ్చాయి. ఇప్పుడు సీన్ రివర్స్ అని పరిశీలకులు అంటున్నారు. 2019 ఆంధ్ర ప్రదేశ్ ఎన్నికల సమయంలో కేసీఆర్ పోషించిన పాత్రను ఇప్పుడు రేవంత్‌రెడ్డి పోషిస్తారనడంలో సందేహం లేదంటూ ఓ టీడీపీ

10లో









# గంగవరం చెన్నకేశవాలయానికి.. విపిఆర్ విరాళం

## రూ.3 లక్షల చెక్కు అందజేసిన వేమిరెడ్డి



కోవూరు నియోజక వర్గంలోని గంగవరం ఎస్‌సి కాలనీలో నిర్మి స్తున్న శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానానికి రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్య క్షులు.. సేవాభూష ణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి (వీపీఆర్) 3 లక్షల రూపాయలు విరాళం అందజేశారు. ఈనెల 2న నెల్లూరులోని తన నివాసంలో ఆలయ కమిటీ సభ్యులకు ఆయన ఆ విరాళం చెక్కును ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మురళీకృష్ణ, హరిబాబు, మల్లికార్జున్, హజరత్, శీనయ్య, జనార్దన్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# కోటపాడు రోడ్డు వేయండి సారూ!



ఆత్మకూరు నియోజకవర్గంలోని మహిమలూరు మజరా కోటపాడు గ్రామానికి రోడ్డు వేయకపోవడంతో ఎంతోకాలం నుంచి ఇబ్బందులు పడుతున్నామని, ఈ గ్రామానికి రోడ్డు నిర్మాణం కోసం జిల్లా కలెక్టర్ రూ. 72 లక్షల రూపాయల నిధిని మంజూరు చేసినా రోడ్డు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 2న విద్యార్థులు, చిన్నారులతో కలసి వారు ఆందోళన నిర్వ హించారు. ప్రజాప్రతినిధులు ఈ విషయం పరిశీలించి వెంటనే రోడ్డు వేసేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

# కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోండి




ప్రజల సంక్షేమం కోసం కేంద్రప్రభుత్వం అందజేస్తున్న అనేక పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, ఎంపీడీఓ జీవిఎస్‌పి ప్రసాద్ కోరారు. ఇటీవల మండల కేంద్రమైన మనుబోలులో వికసిత్ భారత్ సంకల్పయాత్రపై ఆయన ప్రజలకు అవగాహన కలిగించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం రైతులకు ఎంతో ఉపయోగకర మని, రైతులు దానిని ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఓపిఆర్‌డి కృష్ణవేణి, వైద్యాధికారి శేషాద్రివాసు, తహశీల్దార్ కృష్ణయ్య, ఎస్‌బిఐ మేనేజర్ ప్రియదర్శిని, ఏపీఓ రాజమ్మ, ఏపీఎం వనజాక్షి, ఏవో జహీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి




ఎయిడ్స్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఆ వ్యాధి ప్రబల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా లీగల్‌సెల్ అథా రిటీ, సీనియర్ సివిల్ జడ్జి వాణి చెప్పారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఇటీవల నెల్లూరు టౌన్‌హాలులో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి పట్ల యువతకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం. పెంచలయ్య మాట్లాడుతూ, జిల్లాలో హెచ్‌ఐవి తీవ్రత బాగా తగ్గిందని, అయినప్పటికీ ఆ వ్యాధి పట్ల జాగ్రత్తగానే ఉండాలన్నారు. జిల్లాలో అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో హెచ్‌ఐవి పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నా మన్నారు. తొలుత, ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీకి డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ పెంచ లయ్య జెండా ఊపారు. నగరంలోని గాంధీబొమ్మ వద్దనుంచి టౌన్‌హాలు వరకు ర్యాలీ నిర్వహించారు. డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్, జిల్లా క్షయ నియంత్రణాధికారి డాక్టర్ ఎస్ ఖాదర్‌వలీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సిబ్బంది, పలువురు అధికారులు, స్వచ్ఛందసంస్థలవారు, నర్సింగ్ కళాశాలల విద్యార్థినులు పాల్గొన్నారు.



## మూలస్థానేశ్వరునికి ప్రాకారోత్సవం

కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో ఆలయ అర్చ కులు స్వామివారికి వేడుకగా ప్రాకారో త్సవం నిర్వహించారు. తొలుత స్వామి వారికి విశేషాలంకరణలు, అభిషేకాలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహ కులు పర్యవేక్షించారు.

## వేదగిరిలో విద్యారణ్య భారతిస్వామి పూజలు

నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండపై వెలసిన శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని ఇటీవల హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామివారు సందర్శించి, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఛైర్మెన్ సురేంద్రరెడ్డి, ఇఓ గిరికృష్ణ, అర్చ కులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పూజల అనంతరం సన్మానించి, స్వామి వార్ల ప్రసాదాలను అందజేశారు.

## భూములకు నష్టపరిహారం ఇప్పించండి

ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అనంతసాగరం మండలంలో నిర్మించ నున్న జాతీయరహదారి కోసం రైతుల నుంచి తీసుకున్న భూములకు 2013 భూసేకరణ చట్టం కింద రైతులకు న్యాయంగా రావాల్సిన నష్టపరిహారాన్ని చెల్లించేందుకు ఏర్పాట్లు చేయాలని ఇటీవల ఆత్మకూరు రైతుసంఘం నాయకులు ఆత్మకూరు ఆర్డీఓను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘాల నాయకులు ఎల్.ప్రసాద్, గంటా లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు రూరల్‌లో.. ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు

జిల్లాలో వర్షాలు, తుఫాన్ ప్రభావంతో దోమలు ప్రబలి అంటువ్యాధులకు ప్రజలు గురికాకుండా నెల్లూరు రూరల్ మండ లంలో డిసెంబర్ 1నుంచి 15వ తేది వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రూరల్ ఎంపీడీఓ వి. శైలేంద్రకుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతి అధికారి ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమాల్లో భాగంగా, రూరల్‌లోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలను ముమ్మరం చేశామన్నారు. దోమల నివారణ, చెత్త తొలగింపుతో పాటు మంచినీటి వనరులు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామ న్నారు. పారిశుద్ధ్య సమస్యలేమైనా ఉంటే ప్రజలు వాటిని తమ దృష్టికి తీసుకురావా లని, ఆ సమస్యలను వెంటనే పరిష్కరించే దుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# అర్హులందరూ ఓటు నమోదు చేసుకోండి

## జిల్లా కలెక్టర్ హరినారాయణన్



ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ల నమోదు, సవరణలు, మార్పుచేర్పులు వగైరాల కోసం జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో శనివారం, ఆదివారం రోజుల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఓటరుగా నమోదు కానివారు, తమ ఓటు నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ హరి నారాయణన్ పిలుపునిచ్చారు. ఈనెల 2న ఆయన నెల్లూరులోని డికెడబ్ల్యు కాలేజీలో జరుగుతున్న ప్రత్యేక శిబిరాన్ని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. ముఖ్యంగా 18 నుండి 21 సంవత్సరాల లోపు యువత రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును సద్వినియోగం చేసుకుని బాధ్యతగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితాను పరిశీలించుకుని, ఒకవేళ జాబితాలో పేరు లేకపోతే పేరు నమోదు చేసుకునే అవకాశాన్ని అర్హులైనవారు ఉపయోగించుకోవా లన్నారు. నెల్లూరు రూరల్ తహశీల్దార్ సోమ్లానాయక్ తదితరులు పాల్గొన్నారు.

### ఓటు నమోదు చేసుకున్న కలెక్టర్

ఈ సందర్భంగా కలెక్టర్ హరినారాయణన్ తన ఓటును డికెడబ్ల్యు కళాశాలలోని పోలింగ్ కేంద్రంలో నమోదుచేసుకున్నారు. ఫారం-6 దరఖాస్తును పూర్తిచేసి సంబంధిత బిఎల్‌ఓకు అందజేశారు.

# అనారోగ్య బాధితులకు.. రూ. 4.9 లక్షలు సాయం

## - సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ



కందుకూరు మండలం కోవూరు గ్రామంలో అనారో గ్యంతో బాధపడుతున్న ఇద్దరికి సీఎం సహాయ నిధినుంచి సాయం అందింది. బాధితులైన ఉండవల్లి బ్రహ్మయ్యకు రూ. 4లక్షలు, డి కోటి రెడ్డికి 90 వేల రూపాయలు మంజూరయ్యాయి. ఆ చెక్కులను ఇటీవల కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి సమక్షంలో గ్రామ సర్పంచ్ ఆవుల మాధవరావు బాధితులకు అందజేశారు. తమకు ఆర్థికసాయం అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి, అందుకు సహకరించిన ఎమ్మెల్యేకి, సర్పంచ్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యుత్ ఛార్జీలు తగ్గించకుంటే ఉద్యమం

## - బీజేపీ నేతలు



ప్రజలపై మోయలేని భారాన్ని వేస్తూ, పెంచిన విద్యుత్‌ఛార్జీలను ప్రభుత్వం వెంటనే తగ్గిం చాలని బీజేపీ జిల్లా ఉపా ధ్యక్షులు బైరి విష్ణువర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. పెంచిన ఛార్జీలకు నిరసనగా ఇటీవల ఉదయగిరిలో బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నాందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైకాపా నాయకులకు దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజల సమస్యలు పట్టవన్నారు. ఇప్పటికి సుమారు 10 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారని, వాటిని కట్టలేక ప్రజలు నానా బాధలు పడుతున్నారని ఆయన అంటూ, వైకాపా ప్రభుత్వాన్ని గద్దె దింపేవరకు తమ పోరాటం ఆగదన్నారు. ఈ ఆందోళనలో బీజేపీ ఉదయగిరి మండల అధ్యక్షుడు వెంకట స్వామి, గౌరవ అధ్యక్షుడు చల్లా సుబ్బరత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆవుల రోశయ్య, రాష్ట్ర మైనార్టీ విభాగం అధ్యక్షుడు షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

# అభాగ్యులకు 'పవర్‌యూత్' చేయూత



నెల్లూరులోని పవర్ యూత్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాప కులు కోగిలి రమేష్‌రాజు ఆధ్వ ర్యంలో నిర్వహి స్తున్న సేవా కార్య క్రమాల్లో భాగంగా, ఇటీవల ఓ నిరుపేద వృద్ధురాలికి, అనారోగ్యంతో బాధపడుతున్న మరో వృద్ధునికి రెండునెలలకు సరిపడా నిత్యావసర సరుకులు, బియ్యం బస్తా వంతున అందించారు. ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ కాళహస్తి సుధాకర్, కోశాధికారి కమల్‌నాథ్, సభ్యులు మొబీనా, నరేష్, రమేష్, రేవంత్, సాయితేజ, బాలాజీ, సాయిరెడ్డి పాల్గొన్నారు.

# రేవంత్ కొలువులో వై.ఎస్. టీం!

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా తెలంగాణలో ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గమనిస్తే, అక్కడ రాజన్న పాలన మళ్ళీ వచ్చిందా అనిపిస్తుంది. కొత్తగా కొలువుదీరిన మంత్రివర్గంలోని మొత్తం 12 మంది సభ్యుల్లో దాదాపు తొమ్మిదిమంది డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి శిష్యులే. వారంతా వై.ఎస్. ప్రభుత్వంలో కీలకపాత్ర పోషించినవాళ్ళే.

ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు అప్పట్లో డాక్టర్ వై.ఎస్. చాలా కీలక బాధ్యతలు అప్పగించారు. వై.ఎస్. అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జలయజ్ఞం పర్యవేక్షణ బాధ్యత వై.ఎస్., భట్టికి అప్పజెప్పారు. వై.ఎస్.రాజశేఖరరెడ్డికి, డాక్టర్ కేవీపీ రామచంద్రరావుకి భట్టి విక్రమార్క వీర విధేయులు. అలాగే, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వేంకటరెడ్డి, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, దామోదర రాజనరసింహా... కూడా వై.ఎస్. క్యాంపు నుంచి వచ్చిన వారే.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు మాత్రం చంద్రబాబునాయుడు శిబిరం నుంచి వచ్చారు.

ఏపీలో గానీ, తెలంగాణలో గానీ, వై.ఎస్. ప్రభావం లేని కాంగ్రెస్ రాజకీయాలు... నేతలను ఊహించడం కష్టం.

నిజానికి "వై.ఎస్. పాలన తెస్తా" అంటూ ఆయన కుమార్తె వై.ఎస్. షర్మిల తెలంగాణలో ఊరూవాడా కాలినడకన తిరిగారు. చివరకు ఎన్నికల్లో పోటీనే చేయలేకపోయారు. కానీ, ఎన్నికల్లో పోటీచేసి... గెలిచి మంత్రులైన 12మందిలో తొమ్మిది మంది నేతలు డాక్టర్ వై.ఎస్. హయాంలో ఓ వెలుగు వెలిగిన వారే కావడం విశేషం!

అయితే, వై.ఎస్. చనిపోయాక, ఈ 14ఏళ్ళ కాలంలో వీళ్ళెవరూ వై.ఎస్. వారసుడు జగన్‌మోహన్‌రెడ్డితో సన్నిహితంగా లేరు. రాష్ట్రం విడిపోక ముందూ, ఆ తరువాత కూడా జగన్ వీళ్ళతో గాని, వాళ్ళు జగన్‌తో గానీ టచ్‌లో లేరు. ఏదేమైనా, తెలంగాణ మంత్రివర్గంలో వై.ఎస్. టీం ఉండడం పట్ల వై.ఎస్. కుటుంబంతో సన్నిహిత సంబంధాలు కలిగిన ఆంధ్రలోని ఆయన అభిమానులు సంబరపడుతున్నారు!



డిసెంబర్ 5వ తేదీ మంగళవారం, తాడేపల్లిలోని సి. ఎం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై. ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని గౌరవ పూర్వకంగా కలుసుకుని, అభినందనలు తెలియచేస్తున్న 'నాటా' (నార్త్ అమెరికా తెలుగు సొసైటీ ) అధ్యక్షులు డాక్టర్ కోర్శపాటి శ్రీధర్‌రెడ్డి.

# పరమశివుని సన్నిధిలో.. మార్మోగిన 'శివ పంచాక్షరి'

## • ఆల్తూరి సారథ్యంలో.. అఖండ భజనలు



నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈనెల 7న 'శివ పంచాక్షరి' సప్తాహం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పరమశివుని సన్నిధిలో శివనామోచ్ఛరణలు మార్మోగాయి. ప్రముఖ శివభక్తుడు, దాత ఆల్తూరు గిరీష్‌రెడ్డి సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. పరమశివునికి ప్రీతిపాత్రమైన కార్తీకమాసంలో.. గతనెల 11వతేదీన గిరీష్‌రెడ్డి ఆధ్వర్యంలో అనేకమంది భక్తులు శివదీక్షలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పూజల్లో భాగంగా శివపంచాక్షరితో పాటు, అఖండ భజనలు కూడా ప్రారంభమయ్యాయి. శివపూజలతో ఆలయం కళకళలాడింది. ఈ కార్యక్రమాల్లో భాగంగా డిసెంబరు 11వతేదీన ఆలయ ప్రాంగణం నుంచి 12 కలశాలతో పవిత్రమైన పినాకినీ నదీ జలాలను తీసుకుని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువస్తామని, నగరోత్సవంగా పెద్దఎత్తున నిర్వహించనున్న ఈ వేడుకకు భక్తులు తరలి రావాలని గిరీష్‌రెడ్డి కోరారు. కార్తీక మాసం ముగింపు సందర్భంగా డిసెంబర్ 12వ తేదీన పినాకిని పవిత్ర జలాలతో స్వామివారికి అభిషేకం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ పూజా కార్యక్రమాల్లో దేవాదాయశాఖ జిల్లా అధికారి శ్రీనివాసరావు, మూలస్థానేశ్వరాలయం ఇఓ ఆరంబాకం వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులకు ధీటుగా..హోంగార్డుల సేవలు

## ○ అభినందించిన జిల్లా ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



జిల్లాలో పోలీసులకు ధీటుగా హోంగార్డులు సేవలందిస్తున్నారని జిల్లా ఎస్పీ డా.కె తిరుమలేశ్వరరెడ్డి అభినందించారు. 61వహోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఈనెల 6న నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణలతో పాటు పలు విభాగాల్లో హోంగార్డుల సేవలు ప్రశంసనీయమన్నారు. హోంగార్డుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటామని, అన్ని ప్రముఖ కార్పొరేట్ ఆసుత్రుల్లో వారి కుటుంబాలకు రాయితీతో కూడిన వైద్యసేవలందేందుకు కృషి చేస్తామని చెప్పారు. విధి నిర్వహణలో ఉత్తమసేవలందించిన హోంగార్డులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఏఎస్పీ హిమవతి, ప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## తుఫాన్ సహాయక చర్యల్లో..

# అధికారుల చొరవ అభినందనీయం

**ప్రశంసించిన కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న**




మిచౌంగ్ తుఫాన్ విజృంభించి జిల్లాను అస్తవ్యస్తం చేసిన పరిస్థితుల్లో, ప్రజలకు సత్వర సహాయక చర్యలు అందించేందుకు జిల్లా అధికారయంత్రాంగం తీసుకున్న చొరవ అభినందనీయమని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రశంసించారు. ఈనెల 7న కోవూరు మండల పరిషత్ సమావేశ మందిరంలో ఆయన తుఫాన్‌కు సంబంధించిన పలు అంశాలపై అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా రెవెన్యూ, మండలపరిషత్ అధికారులు, పోలీసులు, విద్యుత్‌శాఖ, వ్యవసాయశాఖల అధికారులు బాధితుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పరిస్థితులను చక్కదిద్దారని కొనియాడారు. విద్యుత్ వైర్లు కుప్పలుగా తెగిపోయినా విద్యుత్‌శాఖ సిబ్బంది, అధికారులు ఎంతగానో శ్రమించి సరిచేశారని, సకాలంలో మళ్ళీ విద్యుత్‌ను సరఫరాచేశారని అంటూ వారందరికీ ఆయన అభినందనలు తెలిపారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని, బాధితులకు సత్వర సాయం అందుతుందని చెప్పారు. ఈ సమావేశంలో వ్యవసాయ సలహామండలి సభ్యులు నిరంజన్‌బాబురెడ్డి, కోవూరు ఏఎంసి ఛైర్మన్ రాధాకృష్ణారెడ్డి, జడ్పీటీసీ శ్రీలత, ఎంపిపీ పార్వతి, వైస్ ఎంపీపీ నరసింహులురెడ్డి, డిఎల్‌డిఏ డైరెక్టర్ దినేష్‌రెడ్డి, బొందిలి కార్పొరేషన్ ఛైర్మన్ కిషోర్‌సింగ్, తహశీల్దార్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

# 16న జడ్పీ సమావేశం

నెల్లూరు జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం డిసెంబరు 16వ తేది ఉదయం 10.30 గంటలకు నెల్లూరులోని జడ్పీ సమావేశ మందిరంలో జరుగుతుందని జడ్పీ సీఇఓ చిరంజీవి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్యఆరోగ్య, విద్య, పశు సంవర్ధక, చేనేత తదితర శాఖల పురోగతిపై ఆరోజున సమీక్ష నిర్వహిస్తామని, జడ్పీ సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

# విద్యుత్ సిబ్బంది నిర్విరామ సేవలు

## రేయింబవళ్ళు కష్టించారు... శెభాష్ అనిపించుకున్నారు

మూడురోజుల పాటు జిల్లాలో మిచాంగ్ తుఫాన్ సృష్టించిన భారీ విధ్వంసలో విద్యుత్ వ్యవస్థ కుప్పకూలిపోవడంతో విద్యుత్‌శాఖ వెంటనే అప్రమత్తమైంది. తుఫాన్ గాలులకు, భారీ వర్షాలకు జిల్లాలో వేలాది విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, వందలాది కిలోమీటర్ల విద్యుత్‌లైన్లు తెగిపోవడంతో అంతటా అంధకారం అలముకుంది. జిల్లావ్యాప్తంగా ఎక్కడ చూసినా వేలాదిగా చెట్లు కూలిపోవడం, జనావాసాల వద్ద కూలిన చెట్లు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్‌శాఖ వారు ప్రమాదాలు జరగకుండా వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి, వేగవంతంగా పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. జోరువాన హోరు గాలిలో కూడా నిర్భయంగా స్తంభాలమీదకు ఎక్కి తెగిపోయిన విద్యుత్ తీగలను సరిచేశారు. తుఫాన్ దెబ్బకు విద్యుత్‌శాఖకు కోట్లాది రూపాయల నష్టం కలిగింది. కొన్ని చోట్ల విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఫీడర్లు కూడా పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయి. ఎక్కడ చూసినా రోడ్లమీద తెగిపోయిన కరెంట్‌వైర్లే కనిపించాయి. దీంతో అధికారులు వెంటనే మెరికలకైన సిబ్బందిని 146 ప్రత్యేక బృందాలుగా ఏర్పాటుచేశారు. రాత్రీపగలు కష్టపడి సుమారు 1150 మంది సిబ్బంది అందించిన నిర్విరామ సేవలతో ఎట్టకేలకు విద్యుత్ సరఫరా తిరిగి ప్రారంభం కావడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. తుఫాన్ వచ్చిన మూడురోజుల్లో అనేకచోట్ల విద్యుత్ సరఫరా లేకపోవడంతో జనం అవస్థలు పడినా, ఎప్పటికప్పుడు విద్యుత్ సిబ్బంది అందుబాటులోకి వచ్చి, పడిపోయిన చెట్లను తొలగించి, ఆయా ప్రాంతాల్లో సరఫరాను పునరుద్ధరించడం ప్రజల అభినందనలు అందుకుంది. విద్యుత్‌శాఖ జిల్లా సర్కిల్ పరిధిలోని 42 మండలాల్లోని 1362 గ్రామాలకు విద్యుత్ సరఫరా ఒక్కసారిగా నిలిచిపోవడంతో ఆ శాఖ ఉన్నతాధికారులు స్వయంగా తుఫాన్‌కు దెబ్బతిన్న ప్రాంతాల్లో పర్యటిస్తూ, సిబ్బందికి ఎప్పటికప్పుడు తగు సలహాలు సూచనలు ఇస్తూ పర్యవేక్షించడంతో శరవేగంగా పునరుద్ధరణ పనులు జరిగాయి. గురువారం నాటికి 1215 గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఏపీఎస్పీ డీసీఎల్ సీఎండి సంతోష్‌రావు, ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ చక్రధర్‌బాబు, జిల్లా విద్యుత్‌శాఖ అధికారులు, ఇంజనీర్లు, ముఖ్యంగా లైన్‌మెన్‌లు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధతో ఎట్టకేలకు విద్యుత్ సరఫరా ఒక కొలిక్కి వచ్చింది. దాదాపు అయిదురోజులుగా వారు పడిన శ్రమ, నిర్విరామ కృషి ప్రజల ప్రశంసలకు పాత్రమైంది.



# ప్రకృతి విపత్తులు..మానవ తప్పిదాలు

ప్రకృతి వైపరీత్యాలు ముంచుకొచ్చినప్పుడల్లా మానవతప్పిదాలు సహజంగానే బయటపడుతుంటాయి. తుఫాన్‌లో వరదలో వచ్చినప్పుడల్లా వాటి గురించి కాసేపు ఆలోచించడమే తప్ప, జరిగిన తప్పిదాలు పునరావృతం కాకుండా చూసుకోలేకపోవడం విచారకరం. ప్రకృతిని-పర్యావరణాన్ని కాపాడుకోలేకపోవడం, కర్బన ఉద్గారాలను నియంత్రించలేకపోవడం, ప్రకృతిని అందినంతమేరా ధ్వంసం చేసేయడం, పట్టణీకరణ అని-నగరీకరణ అని చెరువులు కాలువలు పూడ్చేసి చిత్తం వచ్చిన రీతిగా కట్టడాలు కట్టుకుంటూ పోవడం..వాన నీటిప్రవాహాలు రోడ్లమీద, ఇళ్ళల్లోకి ప్రవహించకుండా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థలను పటిష్టంగా నిర్మించుకోలేకపోవడం..ఇలాంటివెన్నో కారణాలు ప్రకృతి విపత్తుల్లో వచ్చే కష్టాలకుతోడుగా ప్రజలకు మరిన్ని బాధలు తెచ్చిపెడుతున్నాయి. వాతావరణ పరిస్థితులన్నీ తారుమారై రుతువులు కూడా మారిపోతున్నాయి. భూతాపం పెరిగిపోయి వాతావరణం మారిపోతోంది. సాధారణంగా జూన్‌లో వచ్చే రుతుపవనాలు ఆలస్యంగా రావడం, పంటల కాలంలో రావాల్సిన వర్షాలు రాకపోవడం, అకాల వర్షాల్లో లేదంటే కుండపోత వానలో వచ్చి రైతుల బతుకులు ఛిద్రం కావడం సర్వసాధారణమైపోయింది. ఏ దేశంలోనైనా ప్రకృతి విపత్తులు సహజామే అయినా, వాటిని ఎదుర్కోవడంలో, నష్టాలను నియంత్రించుకోవడంలో ఇంకా మన దేశం వెనుకబడే ఉంది. అంతా అయిపోయి, చేతులు కాలాక ఆకులు పట్టుకునే చందంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. మొన్నటికి మొన్న ఆంధ్ర-తమిళనాడులను ముంచెత్తిన మిచాంగ్ తుఫాన్‌తో ఆ రెండు రాష్ట్రాలు అల్లాడిపోయాయి. కోట్లాదిరూపాయల నష్టం వాటిల్లింది. అకాలవర్షాలు, తుఫాన్‌లు, ఉప్పెనల వంటి విపత్తులు దేశాన్ని అతలాకుతలం చేస్తూనే ఉన్నాయి. సముద్ర తీరప్రాంతాల్లో మడ అడవులను పరిరక్షించుకుంటే తుఫాన్‌ల సమయంలో అవి రక్షణ కవచంగా ఉపయోగపడతాయని నిపుణులు చెప్తున్నా ఎవరు పట్టించుకుంటున్నారు!.. తీరప్రాంతంతో సహా అన్ని ప్రాంతాల్లో చెట్లు నరికేసి, కాంక్రీట్ మయం చేసుకోవడం వల్ల, పంటకాలువలన్నీ పూడ్చేసి ఎవరి స్వార్థానికి వారు చిత్తానుసారం అక్రమ కట్టడాలు కట్టేయడం వల్ల కలిగే నష్టాలు అన్నిన్ని కావు. ఇవన్నీ తెలిసి చేస్తున్న తప్పులే. పంటలు మునిగాక గోడుగోడుమంటున్న రైతులకు పరిహారం ఇస్తామంటారే కానీ, పంటలు మునగకుండా ఏం చేయాలో అది చేయడం లేదు. ఎన్నిసార్లు తుఫాన్లు వచ్చినా, భారీ వర్షాలు వచ్చినా రోడ్లు ధ్వంసం కావాల్సిందే, విద్యుత్ స్తంభాలు నేలవాలాల్సిందే, చెరువులు వాగులన్నీ పొంగి ఊళ్ళమీద పడాల్సిందే. ఇక అప్పటికప్పుడు ఉరుకులు పరుగులు. అయితే, అప్పటికే జరగాల్సిన నష్టమంతా జరిగిపోయి ఉంటుంది. ఏళ్ల తరబడిగా ఈ గ్రహచారం మనల్ని వీడడం లేదు. గతంలో విపత్తులు వచ్చినప్పుడు ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయో అక్కడ మళ్ళీ అలాంటి ప్రమాదాలు లేదా నష్టాలు జరగకుండా ఏం చేస్తున్నామన్నది ఎవరూ పట్టించుకోక పోవడం వల్లే ఇన్ని అనర్థాలు. వానొచ్చి వాగు పొంగినప్పుడు, ఆ వాగు పొంగకుండా కట్ట గట్టిగా, ఎత్తుగా కట్టుకోవాలన్న సంగతి తెలియని దెవరికి?.. అయితే, కట్టుకుంటున్నామా?.. కేవలం నిర్లక్ష్యం, అలసత్వం, ముందు జాగ్రత్తలు తీసుకోలేని జడత్వం వల్ల కలిగే దారుణాలే ఇవి. విపత్తుల వల్ల పదేపదే అదే ప్రమాదాలు రాకుండా కాపాడుకోలేని పరిస్థితి ఎంత జాలింగొలిపెడదో కదా!.. అంత శాస్త్రజ్ఞానం మనకు లేదా?.. విదేశాల్లో ఈ దుస్థితి ఉందా?..ఎందుకు పరిశీలించుకోలేకపోతున్నాం. గత విపత్తుల నుంచి ఎందుకు గుణపాఠాలు నేర్చుకోలేకపోతున్నాం?..వచ్చే విపత్తు ఎలాగూ వస్తుంది..అట్లని చూస్తూ ఊరుకుంటే జనం బతుకులు ఏం కావాలి?.. ఉన్నట్లుండి ఏ అర్ధరాత్రో గుడిసెల్లోకి నీళ్ళొచ్చేసి అన్నీ కొట్టుకుపోతే.. తుఫాన్‌లో అంతే కదా.. అనుకుని సరిపెట్టుకోగలమా?..ఎన్ని నష్టాలకు ఎంత పరిహారం ఇవ్వగలిగాం?.. లక్షలాది ఎకరాల్లో పంటలు మునిగిపోయాయి.

రైతులకి నిజంగా ఏమిచ్చాం?.. పంట పరిహారాలు సరే, ప్రాణనష్టాలకి ఎంత పరిహారం ఇస్తే మాత్రం ఆ ప్రాణిలేని లోటు తీరుతుందా?..ఇలాంటి విపత్కర విపత్తుల నష్టాల నివారణకు ముందస్తుగా ఏం చర్యలు తీసుకుంటున్నామని సమీక్షించే నాథులే లేకపోవడం మన వ్యవస్థలో మరో పెద్ద లోపం. ఇకనైనా ఈ దుస్థితి మారాలి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విపత్తుల వల్ల సాధారణంగా ఎక్కడెక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయో, వాటిని నివారించడానికి ఇప్పటినుంచైనా శ్రద్ధ తీసుకుని, ముందస్తు చర్యలపై దృష్టిసారిస్తే... మళ్ళీ వచ్చే తుఫాన్ నాటికి అలాంటి ప్రమాదాలు రాకుండా నివారించిన వాళ్లమవుతాం. లేకుంటే మన తప్పిదాలకు నైతికబాధ్యత మనదే కదా!

లాయర్ డిసెంబర్ 08, 2023

# ఓటు.. వేయకుంటే చేటు

ప్రజాస్వామ్యంలో ఓటుకున్న విలువ ఇంక దేనికీ లేదు. అందులోనూ ప్రపంచంలోనే అత్యంత గొప్పదైన మన ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటే పునాది. నేతల తలరాతలనే కాదు, ప్రజల భవితను కూడా తీర్చేదిద్దేది ఓటే. ఎందరో మహనీయులు ప్రాణాలొడ్డి, తమ జీవితాలనే త్యాగం చేసి దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి, మనకి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు ప్రసాదించారు. దేశప్రజలంతా శాంతి సౌభాగ్యాలతో, స్వేచ్ఛాస్వాతంత్ర్యాలతో ఉండాలని కలలు కన్నారు. వాళ్ల కలలను సాకారం చేస్తూ ప్రతిఒక్కరూ బాధ్యతగా మసలుకోవాలి. అది మన బాధ్యత. అందుకు ముఖ్యంగా..మన ప్రజాస్వామ్య దేశంలో రాజ్యాంగం ప్రసాదించిన ఎంతో పవిత్రమైన ఓటు హక్కును ప్రతి ఓటరూ సద్వినియోగం చేసుకోవాలి. 'మన ఓటే-మన భవిష్యత్తు'.. అని అందరూ గుర్తుంచుకోవాలి.

### ఓటే వజ్రాయుధం :

ఓటు అనేది ఒక వజ్రాయుధం. మంచి నేతలను, మంచి ప్రభుత్వాలను ఎన్నుకునేందుకు ఓటే కీలకం. అయినప్పటికీ మన దేశంలో అనేకమంది యువత, విద్యార్థులు ఓటు పట్ల ఇంకా అనాసక్తిగానే ఉండడం విచారకరం. ఇటీవల కాలంలో పెద్దపెద్ద నగరాల్లో ఉన్నవారు, పెద్ద చదువులు చదువుకుంటున్నవారు కూడా ఓటుకు దూరంగా ఉంటుండడం బాధ్యతా రాహిత్యమే అని చెప్పకతప్పదు. ఓటుకున్న విలువను తెలుసుకోకుండా నిర్లక్ష్యంతోనో లేదా నిరాశా నిస్పృహలతోనో ఉన్నందువల్ల ప్రయోజనం ఉండదు. ఓటు వేయకపోవడం అన్నది మంచిపద్ధతి కానే కాదు. మన ఓటుహక్కును మనం సద్వినియోగం చేసుకుని, మన ప్రజాస్వామ్యాన్ని మనం గౌరవించుకోవాలి. దేశంలో స్వాతంత్ర్యం వచ్చాక 1952లో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల్లో కేవలం 45 శాతం మంది మాత్రమే ఓటు వేశారు. ఆ తర్వాత కాలంలో ఓటు విలువ తెలుసుకుని, ప్రజలు చైతన్యంతో ఓట్లు వేస్తున్నారు. దీంతో ఓటింగ్ శాతం క్రమేణా పెరుగుతుండడం సంతోషకరం. అలా పెరుగుతూ..2019 ఎన్నికల నాటికి 67 శాతం మంది ఓటు వేసినట్లు గణాంకాలు చెప్తున్నాయి. అయితే, ఆ చైతన్యం ఇంకా పెరగాలి. ఓటింగ్‌శాతం ఇంకా బాగా పెరగాలి. ఎందుకంటే, చైతన్యవంతమైన ఓటర్ల ద్వారానే ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతమవుతుంది. ఓటు ద్వారానే మంచి విలువలతో కూడిన పటిష్టమైన ప్రజాస్వామ్యం ఏర్పడుతుంది. తద్వారా ప్రజలందరి బాగుకు, దేశప్రగతికి దారులు వేసినట్లవుతుంది.




ప్రజాస్వామ్యంలో ప్రజలదే నిర్ణయాత్మకమైన పాత్ర కనుక, ఎప్పుడు ఏ ఎన్నికలు వచ్చినా, ఓటర్లు విజ్ఞతతో ఓటుహక్కును వినియోగించుకోవాలే తప్ప, ఏ కారణం వల్లనైనా సరే..ఓటు వేయకుండా ఉండడం మంచిది కాదు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరికీ మన రాజ్యాంగం ఓటు హక్కు కల్పించింది. ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలి. స్వేచ్ఛగా, స్వతంత్రంగా మన ఓటు హక్కును మనం సద్వినియోగం చేసుకున్నప్పుడే సమాజానికి మంచి జరుగుతుంది. ఓటు వేయడం ద్వారా..మన ప్రజాస్వామ్యాన్ని మనం గౌరవించుకోవాలి. ఇది అందరి నైతిక బాధ్యతగా గుర్తుంచుకోవాలి. ఇప్పటికీ ఇంకా ఎవరైనా ఓటు నమోదు చేసుకోని అర్హులైన వారెవరైనా ఉంటే, ఏమాత్రం తాత్సారం చేయబాకండి. వెంటనే ఓటు నమోదు చేయించుకోండి.

### ప్రలోభాలకు లొంగకూడదు :

రాజకీయాలు కలుషితమైన నేటి కాలంలో ఓటు ఇంతని రేటు పెట్టి డబ్బులిచ్చే వారుంటారు. ఓటుకు నోటంటూ బేరాలు చేస్తారు. అందులోనూ నేరాలు చేసేవాళ్ళు, రౌడీలు, గూండాలు, అసాంఘికశక్తులు కూడా రాజకీయాల్లో రాజ్యమేలుతున్న దౌర్భాగ్యకాలం ఇది. మద్యం పోసి, డబ్బులిచ్చి ఓటు వేయించుకోవాలని ప్రయత్నాలు చేసేవాళ్లుంటారు. తస్మాత్ జాగ్రత్త! పేద బలహీనతలను అడ్డంపెట్టుకుని వారికి కానుకలిచ్చి మాయచేద్దామని చూసే బురిడీగాళ్ల బుట్టలో పడకండి. ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటును అమ్ముకోవడం మంచిది కాదు. స్వేచ్ఛగా ఓటు వేయడం అనేది మన హక్కు. ఎవరి వత్తిళ్లకూ, ఎవరి ప్రలోభాలకు, మాయమాటలకు లొంగకుండా నిర్భయంగా మనకు నచ్చినవారికే ఓటువేయాలి. అంతేకాదు, ఎన్నికల్లో తాము గెలిచాక అవిచేస్తాం..ఇవి చేస్తాం అంటూ లేనిపోని వాగ్దానాలిచ్చే వాళ్లకీ కొదవ ఉండదు. వారు చెప్పే మాటలు, చేసే చేతలు ఎంతవరకు సమంజసమైనవో ఎవరికి వారు పరిశీలించుకోవాలి. ఎవరు విశ్వసనీయమైన వాళ్లో మన విజ్ఞతతో మనమే తెలుసుకోవాలి. అవినీతిపరులకు, అక్రమార్కులకు చెక్ పెట్టేలా ఓటును వజ్రాయుధంగా వినియోగించుకోవాలి. నీతి నిజాయితీలకే పట్టం కట్టాలి. నైతిక విలువలతో, న్యాయంగా ప్రజల కోసం బాధ్యతాయుతంగా పనిచేసే వారిని ఎన్నుకున్నప్పుడే మన ప్రజాస్వామ్య వ్యవస్థ కూడా బలోపేతం అవుతుంది. ఏ కారణం వల్లనైనా.. ఓటును అమ్ముకున్నారో.. అది మన భవితకే చేటుగా మారుతుంది. చివరికది మన నైతికతకే సిగ్గుచేటుగా కూడా తయారవుతుంది.

- రాజశ్రీ

## లోతట్టు ప్రాంతాల గతి ఇంతేనా?

తుఫాన్లు, లేదా భారీ వర్షాలు వచ్చినప్పుడల్లా నెల్లూరులోని అనేక లోతట్టు ప్రాంతాల్లో నీటిప్రవాహం వస్తుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వానలొచ్చినప్పుడల్లా పిల్లాపాపల్ని వెంటేసుకుని రాత్రికిరాత్రి పునరావాస కేంద్రాలకు తరలిపోవడం తప్పనిసరి అవుతోంది. నగరంలోని పాత మునిసిపల్ కార్యాలయం ప్రాంతం, బట్వాడిపాళెం, పరమేశ్వరినగర్, మన్సూర్‌నగర్, మైపాడు గేట్ తదితర ప్రాంతాల్లోనే కాక, శివారు ప్రాంతాల ప్రజలు కూడా విపత్తుల సమయంలో పడే బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. నెల్లూరు నగరంలోని రోడ్లయితే, మురుగునీళ్ళ ప్రవాహాలే. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వానలొచ్చినప్పుడల్లా ఈ బాధలు తప్పడం లేదు. అధికారులు చురుగ్గానే పనిచేస్తున్నారు కానీ, ఈ కష్టాలకు ఫుల్‌స్టాప్ పెట్టలేకపోతున్నారు. మూడురోజులపాటు తుఫాన్ గాలుల్లో, వానల్లో నగర ప్రజలు నరకాన్ని చవిచూశారంటే అతిశయోక్తి కాదు. ఒకవైపు కరెంటు లేక, మరోవైపు ఫోన్లు పనిచేయక, వీధుల్లోని చెట్లన్నీ కూలిపోయి వాహనాల రాకపోకలు లేక ఒక బాధ కాదు. నగర ప్రజలకు ఈ యాతనలు ఎప్పుడు తప్పుతాయో.. ఆ దేవుడికే ఎరుక!... - సిహెచ్ కార్తీక్, నెల్లూరు.

## దాతలు ఆదుకోవాలి

తుఫాన్ దెబ్బకు విలవిలలాడుతున్న నిరుపేదలను, నిరాశ్రయులను దాతలు ఆదుకోవాల్సిన సమయం ఇదే. ఇటీవల మూడు రోజుల పాటు భారీవర్షాలు, ఈదురుగాలుల వల్ల ఎంతో మంది పేదలు నిరాశ్రయులయ్యారు. నెల్లూరు జిల్లాలో ధనికులకు, దాతృత్వం ఉన్న మహా దాతలకు కొదవలేదు. జిల్లాకు అదొక అదృష్టం. చలికి వణుకుతూ వృద్ధులు, బాలలు, నిరుపేదలు ఎందరో బాధలు పడుతూనే ఉన్నారు. దాతలు, స్వచ్ఛంధసంస్థల వారు, మానవతావాదులు ముందుకొచ్చి ఆయా ప్రాంతాల్లో వారికి చేతనైనంత సాయం చేయగలిగితే బాగుంటుంది. ఈ కష్టకాలాల్లో బాధితులను ఆదుకోగలిగితే అంతకన్నా పుణ్యం ఏముంటుంది! - ఎస్ విశ్వం, కోవూరు.

ఈ-మెయిల్
ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

## జగనన్న ఇళ్ళు.. ఎక్కడ చూసినా నీళ్లు

జిల్లాలోని అనేకప్రాంతాల్లో ప్రభుత్వం పేదలకోసం కడుతున్న జగనన్న కాలనీలు, ఇళ్ల సక్రమంగా ఉండడం లేదు. ఎక్కడెక్కడో పొలాల్లో, ఖాళీస్థలాల్లో ఈ ఇళ్లు కడుతున్నారు. అక్కడికి వెళ్లాలంటే దూరం. అందులోనూ ఎలాంటి వసతులు ఆ కాలనీల్లో ఇంకా ఏర్పాటు చేయలేదు. మొన్నటి తుఫాన్‌కు ఎక్కడ చూసినా ఆ కాలనీల్లో నీళ్ళు వచ్చేసి అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితి. కాలనీల్లో నీళ్ళు వెళ్ళే మార్గాలు లేకుండా ఇష్టం వచ్చినట్లు అడ్డదిడ్డంగా కట్టేస్తున్నారు. భవిష్యత్తులో అవి సమస్యలకు నిలయాలుగా మారిపోతాయి. ఇప్పటినుంచే మురుగునీళ్ల బయటకు వెళ్ళేలా, మౌలిక సదుపాయాలన్నీ సక్రమంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు విజ్ఞప్తి. - కెవిఎస్ఎన్ మస్తానయ్య, కావలి.





# జిల్లాలో... విరుచుకుపడ్డ తుఫాన్

- మూడురోజులు ఈదురుగాలులు.. భారీ వర్షాలు
- పొంగిపొర్లిన వాగులు వంకలు
- ఎక్కడ చూసినా కూలిన చెట్లు, నేలవాలిన కరెంటు తీగలు
- వేలాది ఎకరాల్లో పంటల మునకతో రైతుల గగ్గోలు
- రూ. 411 కోట్లకు పైగానే నష్టం



***'మి*చాంగ్' తుఫాన్ జిల్లాలో భీభత్సం సృష్టించింది. వేలాది ఎకరాల్లో పంటలన్నిటినీ ముంచి రైతులను కన్నీరు పెట్టించింది. మొన్నమొన్నటిదాకా పంటలకు నీళ్ళులేవో అంటూ గగ్గోలు పెట్టిన రైతులు ఈ తుఫాన్‌కు, భారీవానలకు బెంబేలెత్తిపోయారు. డిసెంబరు 3 నుంచి 5వ తేది దాకా తుఫాన్ జిల్లాను అతలాకుతలం చేసింది. జనజీవనం స్తంభించిపోయింది. గాలుల దెబ్బకు పెద్దపెద్ద చెట్లు, వందల ఏళ్ళనాటి వృక్షాలు సైతం కూలిపోయాయి. వాగులు వంకలు పొంగిపొర్లి లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. తుఫాన్‌కు అనేకప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. జనావాసాల వద్ద చెట్లు పడిపోయి, కరెంటు తీగలు తెగిపడడంతో విద్యుత్‌ను నిలిపి వేయడంతో అనేకప్రాంతాల్లో అంధకారం అలముకుంది. నెల్లూరు నగరంతో సహా జిల్లా అంతా ఈ తుఫాన్ ధాటికి అల్లాడిపోయింది. మొత్తంగా 411 కోట్ల రూపాయలకు పైగానే నష్టం వాటిల్లివుంటుందని అంచనా.**

జిల్లాకు అదునుకు పదునైన వానలు కురవకపోగా, తుఫాన్ వస్తేనే ఇక వానలు అన్నట్లుగా తయారైంది పరిస్థితి. మిచాంగ్ పేరుతో వచ్చిన తుఫాన్‌తో మూడు రోజులపాటు వానలు దంచికొట్టాయి. ఒకటే వాన. ఈదురుగాలులతో జనం వణికిపోయారు. పంట పొలాలు, వరి నారుమళ్ళు నీటమునిగాయి. అరటి తోటలు గాలుల ధాటికి ధ్వంసమయ్యాయి. మామిడి, కొబ్బరిచెట్లు సైతం అనేకప్రాంతాల్లో నేలకూలాయి. పొదలకూరు ప్రాంతంలో నిమ్మచెట్లు వేళ్ళతో సహా పైకిలేచి కూలిపోవడంతో పూత, పిందె అన్నీ రాలిపోయాయి. ఈ ప్రాంతంలో వేలాది ఎకరాల్లో ఉన్న నిమ్మతోటలు దెబ్బతిన్నాయని రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా వాగులువంకలు పొంగిపొర్లడంతో అనేకప్రాంతాలు జలమయమయ్యాయి. ఎక్కడ చూసినా రోడ్లు నీటి ప్రవాహాలతో కాలువల్లా కనిపించాయి. లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. కండలేరు వాగు ఉధృతంగా పొంగిపొర్లడంతో మనుబోలుకు రాకపోకలు స్తంభించిపోయాయి. కావలి సమీపంలోని మద్దూరుపాడు చెరువు తెగిపోవడంతో పంటపొలాలు దెబ్బతిన్నాయి. చెరువు సమీపంలోని ప్రాంతాలన్నీ కాలువలయ్యాయి. సముద్ర తీర ప్రాంతాల్లో తుఫాన్ విలయంగా విరుచుకుపడింది.

## మనుబోలులో అత్యధికంగా 317.6 మి.మీ వర్షం

మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో ఈనెల 5న జిల్లావ్యాప్తంగా సగటున సుమారు 164.7మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందంటే వానలెంత తీవ్రరూపం దాల్చాయో అర్థం చేసుకోవచ్చు. సుమారు 100 నుంచి 300 మిల్లీమీటర్ల దాకా వానలు కురిసి భీభత్సం సృష్టించాయి. అత్యంత ఎక్కువగా మనుబోలు మండలంలో 317,6 మిల్లీమీటర్ల వర్షం కురవడంతో ఆ మండలంలోని అనేక ప్రాంతాలు నీటమునిగాయి. రోడ్లపై వరదనీరు ప్రవాహాలుగా కనిపించాయి. అదేవిధంగా పొదలకూరు మండలంలో 234.6, వెంకటాచలంలో 227.8, సంగలో 220.6, నెల్లూరు రూరల్‌లో 214.4, ముత్తుకూరులో 210.4, అనంతసాగరంలో 195.8, ఆత్మకూరులో 193.2, కలువాయిలో 192.8, బుచ్చిరెడ్డిపాళెంలో 192.4, దగదర్తిలో 174.6, జలదంకిలో 163.8, తోటపల్లిగూడూరులో 163.2, ఇందుకూరుపేటలో 161.2, అల్లూరులో 158.6, కొడవలూరులో 154.2, విడవలూరులో 152.6, మర్రిపాడులో 147.6, కలిగిరిలో 147,2, కావలిలో 142.2, చేజర్లలో 139.4, కొండాపురంలో 137.2, వింజమూరులో 136.6, అనుమసముద్రంపేట (ఏఎస్‌పేట)లో 132.4, ఉదయగిరిలో 128.4, లింగసముద్రంలో 122.2, ఉలవపాడులో 121.8, బోగోలులో 115.2, కందుకూరులో 106.6, గుడ్లూరులో 106.6 మిల్లీమీటర్ల వంతున వర్షపాతం నమోదైంది. వానల ధాటికి రోడ్లు తెగిపోవడం, చెరువులు, కాలువలకు అక్కడక్కడా గండ్లుపడడంతో ఆయా ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు.

## విద్యుత్‌శాఖకు రూ.10 కోట్లకు పైగానే నష్టం - సీఎండీ సంతోష్‌రావు

జిల్లాలో మిచాంగ్ తుఫాన్ కారణంగా విద్యుత్ సంస్థకు సుమారు రూ.10కోట్లకుపైగానే నష్టం వాటిల్లివుంటుందని ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌రావు చెప్పారు. ఈనెల 5న ఆయన నెల్లూరు నగరంలో జరుగుతున్న విద్యుత్‌పునరుద్ధరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ భవన్‌లో ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ చక్రధర్‌బాబుతో కలసి ఆయన మాట్లాడుతూ, నెల్లూరు, చిత్తూరు, వైఎస్సార్ జిల్లాల్లో ఈ తుఫాన్ ధాటికి పలు పట్టణాలతో పాటు 1119 గ్రామాల్లో విద్యుత్ సరఫరా దెబ్బతిన్నదని, యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు 100 ప్రత్యేక బృందాలతో పనులు చేపట్టామని తెలిపారు. ఈ మూడు జిల్లాల్లో 33 కేవీ సబ్‌స్టేషన్లు 305, 184 ఫీడర్లు, 11 కేవీ ఫీడర్లు 1220, 33 కేవీ లైన్ల విద్యుత్ స్తంభాలు 835, 11 కేవీ విద్యుత్ స్తంభాలు 3272, పవర్ ట్రాన్స్‌ఫార్మర్ 1, మరో 1268 డిస్ట్రిబ్యూషన్లు దెబ్బతిన్నాయని, 123 కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్లు తెగిపోయాయని వివరించారు.

## స్తంభించిన జనజీవనం :

సోమవారం నుంచి బుధవారం దాకా ఈ భీభత్సంతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజల బాధలు అన్నిన్ని కావు. గ్రామీణప్రాంతాల్లోనూ, పట్టణాల్లోని శివారుప్రాంతాల్లోనూ ఇళ్లల్లోకి నీళ్లొచ్చి జనం నానా యాతనలు పడ్డారు. పలు ప్రాంతాల్లో ఇళ్ళు కూలిపోయాయి. మంచినీళ్ళకు కటకట ఏర్పడింది. సెల్ టవర్లు దెబ్బతినడంతో సెల్‌ఫోన్లు, ఇంటర్‌నెట్ సక్రమంగా పనిచేయలేదు. అనేకచోట్ల రోడ్లు ధ్వంసం కావడం, రోడ్లమీదికి నీళ్ళ ప్రవాహం రావడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. ప్రయాణాలు బంద్ అయ్యాయి. విద్యుత్ స్తంభాలు నేలకూలడం, ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోవడంతో విద్యుత్ వ్యవస్థ కుప్పకూలిపోయింది. నెల్లూరులో ప్రధానమైన 33 కేవీ విద్యుత్ ఫీడర్ దెబ్బతినడంతో సోమవారం మధ్యాహ్నం నుంచి మంగళవారం సాయంత్రం దాకా విద్యుత్‌సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తుఫాన్ దెబ్బకు విద్యుత్‌శాఖకు కోట్లాదిరూపాయల నష్టం వాటిల్లింది. వందలాది సబ్‌స్టేషన్లు దెబ్బతినడం, వేలసంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకూలడంతో నష్టం కోట్లల్లోకి చేరింది. చెట్లు కూలిపోవడంతో వాటిని తొలగించి, విద్యుత్‌లైన్లు సరిచేయడం కష్టతరంగా మారింది. జిల్లావ్యాప్తంగా పంటలకు ఏమేరకు నష్టం వచ్చిందో, ఏఏ రంగాలకు ఎంతెంత నష్టాలు వాటిల్లాయో అధికారులు లెక్కలు కడుతున్నారు. జిల్లాలో అనేకరంగాలకు మొత్తంగా తుఫాన్ నష్టం రూ. 411 కోట్లకు పైగానే ఉంటుందని అధికారులు ప్రాథమిక అంచనాలు వేశారు.

## కావలి తీరం..కకావికలం :

తుఫాన్ ప్రభావంతో కావలి తీరప్రాంతం వద్ద సముద్రం సుమారు 3 వందల మీటర్లు ముందుకు రావడంతో, సముద్రపు ఒడ్డున మత్స్యకారులు కట్టిపెట్టివున్న వందలాది బోట్లు, పడవలు, వలలు అన్నీ సముద్రంలోకి కొట్టుకుపోయాయి. ముఖ్యంగా తుమ్మలపెంట, అన్నగారిపాళెం, పెద్దపట్టపుపాళెం తదితర ప్రాంతాల్లో మత్స్యకారులు లక్షల రూపాయల సామగ్రిని కోల్పోయి అల్లాడుతున్నారు. మరోవైపు తీరప్రాంతాల్లో ఉన్న రొయ్యలగుంటలు వాననీటి ప్రవాహంలో కలసిపోవడంతో వాటి యజమానులు లబోదిబోమంటున్నారు. అదేవిధంగా బోగోలు మండలం తాటిచెట్లపాళెం వద్ద సముద్రం ముందుకు చొచ్చుకురావడంతో తీరం భారీగా కోతకు గురైంది. ఇలా అన్నిప్రాంతాల ప్రజలు తుఫాన్ దెబ్బకు అనేక కష్టనష్టాలకు గురయ్యారు.

## బాధితులను ఆదుకుంటాం - మంత్రి కాకాణి



తుఫాన్ బాధితులను అన్నివిధాలా ఆదుకుంటామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఈనెల 5న ఆయన కావలి నియోజకవర్గంలో తుఫాన్‌కు దెబ్బతిన్న దగదర్తి –చెన్నూరు రహదారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తుఫాన్‌బాధిత ప్రాంతాల్లో ప్రజలను ఆదుకునేందుకు సత్వర చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లా అధికారయంత్రాంగం ముందస్తుగా చేపట్టిన చర్యల వల్ల ఈ తుఫాన్‌లో ప్రాణనష్టం జరగలేదని తెలిపారు. కాలువలకు, చెరువులకు పడిన గండ్లకు ఎఫ్‌డిఆర్ నిధులతో మరమ్మతులు చేయిస్తామన్నారు. వరినార్లు మునిగిపోయిన అన్నదాతలకు వరి విత్తనాలను సబ్సిడీపై అందజేస్తామన్నారు. పునరావాసకేంద్రాల్లో ఉంటున్న తుఫాన్ బాధితులకు ఒక్కో కుటుంబానికి రూ. 2500, ఒక్కరికైతే వెయ్యి రూపాయల వంతున తక్షణ సాయం అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలిచ్చారని, దాంతోపాటు ఇళ్ళు నీటమునిగిన ప్రాంతాల్లో ప్రజలకు ఉచితంగా పాతిక కేజీల బియ్యం, పామాయిల్ ప్యాకెట్, కేజీ కందిపప్పు, కేజీ ఎరగడ్డలు, కేజీ ఉల్లగడ్డలు వంతున ప్రతి కుటుంబానికి అందేలా చర్యలు చేపట్టామని చెప్పారు. మంత్రి వెంట కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, జేసీ కూర్మనాథ్, కావలి ఆర్డీఓ శీనానాయక్ తదితరులున్నారు.

# నెల్లూరు కబుర్లు



## మహిళలకు జీవనోపాధిగా..ఆటోలు

మహిళా సాధికారతే ప్రధాన లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఈనెల 7వ తేదీ గురువారం ఉదయం నగరంలోని డైకస్‌రోడ్డులో మంత్రి క్యాంపు కార్యాలయంలో ఉన్నతి(ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్) పథకం ద్వారా మహిళాశక్తి పేరుతో పేద మహిళలకు ఆటోలను మంత్రి కాకాణి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లో పేద మహిళలకు 10శాతం లబ్దిదారుని వాటా, 90శాతం వడ్డీలేని రుణంతో ఆటోలను పంపిణీ చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 220 ఆటోలను పంపిణీ చేస్తుండగా, జిల్లాలో 10ఆటోలను అందజేశామన్నారు. నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, నగర మేయర్ స్రవంతి, కలెక్టర్ హరినారాయణన్, డిఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డితో కలిసి మంత్రి జెండాఊపి ఆటోలను ప్రారంభించారు.

## నెల రోజులపాటు డా. అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాలు



భారత రాజ్యాంగ నిర్మాత, పీడితకులాల విముక్తిప్రదాత డా.బిఆర్ అంబేద్కర్ ఆశయాల బాటలో అందరూ నడవాలని, ఆ మహనీయుని ఆదర్శంగా తీసుకుని ప్రజలను చైతన్యవంతులను చేయాలని దళిత సంగ్రామ సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 6 నుంచి జనవరి 6వ తేది వరకు జరుగుతున్న కార్యక్రమాలను విజయవంతం గావించాలని నాయకులు పిలుపునిచ్చారు. డా.అంబేద్కర్ 67వ వర్ధంతిని పురస్కరించుకుని అఖిలభారత ఎస్సీ ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మురళి, జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి దాసు, నెల్లూరు నగర అధ్యక్షులు బూరగ పురుషోత్తం, మహిళా అధ్యక్షురాలు సుజాత తదితరులు నెల్లూరులో ఈనెల 6న డా. బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## భక్తిశ్రద్ధలతో.. కార్తీక లక్ష దీపోత్సవం



### వేమిరెడ్డి దంపతుల ఆధ్వర్యంలో విశేష పూజలు

పరమశివునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీకమాసాన్ని పురస్కరించుకుని రాజ్యసభ సభ్యులు, జిల్లా వైకాపా అధ్యక్షులు.. సేవాభూషణులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆయన సతీమణి..టీటీడీ ఉత్తర భారతదేశ ఆలయాల స్థానిక సలహామండలి–న్యూఢిల్లీ అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి నేతృత్వంలో ఇటీవల మూడురోజుల పాటు నెల్లూరు విఆర్‌సి మైదానంలో కార్తీక లక్ష దీపోత్సవం కార్యక్రమాన్ని వైభవోపేతంగా నిర్వహించి భక్తులకు కన్నులపండుగ చేశారు. ఈ సందర్భంగా విఆర్‌సి మైదానం శివనామోచ్ఛారణలతో మార్మోగింది. డిసెంబరు 1 నుంచి 3వ తేదీ వరకు జరిగిన ఈ ఉత్సవాల్లో భాగంగా, మూడవరోజున వేమిరెడ్డి దంపతులతో పాటు, ప్రముఖ ప్రవచనకర్తలు బుర్రా భాస్కరశర్మ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు కోటారెడ్డి దంపతులు పాల్గొని కార్తీక లక్ష దీపోత్సవ ప్రాంగణంలో ఆకాశదీపాన్ని వెలిగించారు. మైదానంలో కొలువుదీర్చిన దేవతామూర్తులకు, శ్రీ వైద్యనాథ్ శివలింగానికి, ఉడిపి శ్రీ కృష్ణభగవానునికి విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులు కార్తీకదీపాలు వెలిగించారు. ఉదయం యాగశాలలో చండీయాగం, 501 మంది రుత్విక్కులతో శ్రీ వీరవెంకటసత్యనారాయణస్వామివారి సామూహిక వ్రతం పెద్దఎత్తున జరిగాయి. భారీసంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ముగింపు సందర్భంగా ఆరోజు రాత్రి శ్రీశైలం దేవస్థానం అర్చకుల ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణోత్సవం వైభవోపేతంగా జరిగింది.

## నిత్యావసర సరుకుల వితరణ



తుఫాన్ ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న సుమారు 500 కుటుంబాలకు నెల్లూరు స్టోన్‌హౌస్ పేట సీఆర్పీ డొంకలో ఉన్న శ్రీ మహాలక్ష్మి అమ్మ వారి దేవస్థానం వంశ పారంపర్య ధర్మకర్తలు జగన్నాథం–పద్మజ దంపతులు ఈనెల 6న నిత్యావసర సరుకులు తమ వితరణగా అందజేశారు.



## మహనీయుడు..మాగుంట సుబ్బరామిరెడ్డి

మాజీ ఎంపి, ప్రజాసేవే పరమార్ధంగా భావిస్తూ ప్రజల సంక్షేమం కోసం అనేక కార్యక్రమలు చేపట్టిన దివంగత నేత మాగుంట సుబ్బరామిరెడ్డి సేవలు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. ఇటీవల ఆయన వర్ధంతి సందర్భంగా నెల్లూరులోని ఎస్–2 థియేటర్‌లో జరిగిన కార్యక్రమంలో మాగుంట సుబ్బరామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఆయన సేవలను స్మరించుకున్నారు. పేదప్రజలంటే మాగుంటకు ఎంతో ప్రేమని, పేదల కోసం ప్రభుత్వం కూడా చేయని అనేక సంక్షేమ కార్యక్రమాలను మాగుంట నిర్వహించి ప్రజల హృదయాల్లో శాశ్వతస్థానం సంపాదించుకున్నారని ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సీవీ శేషారెడ్డి అన్నారు. వారి ప్రజాసేవ ఆదర్శనీయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం, విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, సుబ్బరామిరెడ్డి మనుమడు జూనియర్ మాగుంట సుబ్బరామిరెడ్డి, పీసీసీ సభ్యుడు బాలసుధాకర్, గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వేదగిరి లక్ష్మీనరసింహస్వామిదేవాలయం ఛైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, వైకాపా నాయకుడు కొడవలూరు ధనుంజయరెడ్డి, ఏఎంసి మాజీ ఛైర్మన్ ఏసునాయుడు, పత్తి రవీంద్రబాబు పాల్గొన్నారు.

### సంతపేట ఆంజనేయస్వామి గుడిలో

## 17న..వార్షికోత్సవ వేడుకలు



నెల్లూరు సంతపేటలో ఉన్న ప్రసిద్ధమైన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో డిసెంబరు 17వతేది నుంచి దేవస్థానం వార్షికోత్సవ వేడుకలు జరుగనున్నాయి. ఈ ఆలయం పునర్నిర్మాణం జరిగి 6 సంవత్సరాలు పూర్తయి, 7వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈనెల 6న ఆలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేశారు. స్వామివారికి విశేషమైన అలంకారాలతో క్షీరాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, ఆకుపూజలు..హోమాలు నిర్వహిస్తామని, భక్తులు పెద్దసంఖ్యలో తరలిరావాలని ఆలయ ఛైర్మన్ చందోలు సతీష్‌కుమార్ విజ్ఞప్తిచేశారు. ఆలయ ఇఓ దర్గయ్య, ప్రధాన అర్చకులు చంద్రశేఖరస్వామి, కమిటీ సభ్యులు రవి, రజని, ప్రశాంతి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

## 'తంగిరాల మహాభారతం' 84వ భాగం




ధృతరాష్ట్రునికి పాండవుల గురించి లోపల భయం భయంగా ఉంటుంది... వాళ్ళు తిరిగివచ్చి కౌరవకులాన్ని నాశనం చేస్తారేమోనని. విదురుణ్ణి, వాళ్ళు అరణ్యవాసంలో ఏంచేస్తున్నారని అడుగుతాడు. విదురుడు పాండవుల గురించి గొప్పగా చెప్పినప్పుడు, అది సహించలేక నీవు ఎల్లప్పుడూ పాండవుల పక్షాన్నే మాట్లాడతావు, నీ సలహాలు, సహాయాలు అక్కర లేదని, వారి దగ్గరికే వెళ్లిపొమ్మని పరుషంగా మాట్లాడుతాడు. విదురుడు కోపం వచ్చి పాండవుల దగ్గరికి వెళ్లిపోయిన తర్వాత అతని ఎడబాటు భరించలేక సంజయుణ్ణి పిలిచి విదురుణ్ణి తిరిగి రప్పిస్తాడు. కర్ణుడు, దుర్యోధనునికి అరణ్యంలో ఉన్న పాండవులను అక్కడ సంహరించడం మంచిదని సలహా ఇచ్చినప్పుడు దుర్యోధనుడు దానికి మెచ్చి రణరంగ సన్నాహాలు చేయమని ఆదేశిస్తాడు. దూరదృష్టితో ఇది తెలుసుకున్న వేదవ్యాసుడు, ధృతరాష్ట్రుని దగ్గరికి వచ్చి దుర్యోధనుడు తలపెట్టిన సమరం మంచిది కాదని, అతన్ని మంచి మార్గంలో పెట్టడానికి అరణ్యంలో ఉన్న ధర్మరాజు దగ్గరికి వెళ్లి కొన్నాళ్ళు నివసించమని సలహా ఇస్తాడు.

భారత కాలమానం ప్రకారం ప్రతి శనివారం ఉదయం యూట్యూబ్‌లో తంగిరాల 'మహాభారతం' అందుబాటులోకి వస్తుంది. పూర్తి నిడివి కోసం Syam Tangirala Mahabharatam @YouTubeలో చూడగలరు.






## విభజన హామీలు అమలుచేయని కేంద్రం

### సిపిఎం నేత బీవీ రాఘవులు



రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇస్తామని చెప్పిన బీజేపీ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీని నేటికీ అమలుచేయకపోవడం దారుణమని, విభజన హామీలు పట్టించుకోకపోవడం అన్యాయమని సిపిఎం పొలిట్ బ్యూరోసభ్యులు బీవీ రాఘవులు విమర్శించారు. ఇటీవల ఆయన నెల్లూరులోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం రకరకాల పన్నుల ద్వారా ప్రజలపై అధిక భారం మోపుతూ ఇబ్బందులకు గురిచేస్తోందని, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు తెలియజెప్పాలని, ప్రభుత్వాల పనితీరుని వ్యతిరేకిస్తూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికల్లో సిపిఎం అన్ని అసెంబ్లీ స్థానాల్లోనూ పోటీ చేస్తుందని, అందుకు నాయకులు సమాయత్తం కావాలని సూచించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, నాయకులు చంద్ర రాజగోపాల్, మోహన్‌రావు, మాదాల వెంకటేశ్వర్లు, కత్తి శ్రీనివాసులు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ అంబేద్కర్ వర్ధంతి

నెల్లూరులోని కొండాయపాళెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో ఈనెల 6న భారత రాజ్యాంగ నిర్మాత.. మహా మేధావి.. డా. బిఆర్ అంబేద్కర్ వర్ధంతి ఘనంగా జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యం.భాస్కర్‌రావు విద్యార్థులతో కలిసి డా. అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం, ఆ మహనీయుని జీవితవిశేషాలను విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

# రైతాంగానికి సాగునీరు విడుదల చేయండి

## • అధికారులతో నెల్లూరు ఎంపీ ఆదాల సమీక్ష



సోమశిల జలాశయం నుండి కనుపూరు కెనాల్ ద్వారా జిల్లా రైతాంగానికి సాగునీరు విడుదల చేయాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు, రూరల్ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితో కలసి ఆయన సోమవారం జిల్లా నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లా రైతాంగం అవసరాలను దృష్టిలో ఉంచుకొని సాగునీరు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన చెప్పారు. సోమశిల నుండి 2 లక్షల 20 వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అంచనాలు తయారుచేయాలని అధికారులను కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, జిల్లా రైతాంగం పంటలు వేసుకునేందుకు అవసరమైన మేరకు సాగునీరు విడుదలకు అవసరమైన అన్ని చర్యలను చేపడుతున్నామన్నారు. గత 15 రోజులుగా సోమశిల ప్రాజెక్టు ద్వారా నీరు విడుదల చేయకపోవడంతో మరో 7 టీఎంసీల వరకు నీరు అదనంగా చేరిందని, ఇప్పుడు విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సాగునీటికి ఇబ్బంది లేదని తెలిపారు. కనుపూరు కెనాల్ క్రింద ఇప్పటికే రైతులు నారుమడులు వేసుకొని నాట్లు వేసేందుకు సిద్ధంగా ఉన్నారని, జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనాసరే రైతులకు సాగునీరు అవసరమైతే వెంటనే అధికారులు నీరు విడుదలకు చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. జిల్లా రైతాంగం ఎటువంటి భయాందోళన చెందకుండా పంటలు వేసుకోవాలని, రైతాంగానికి ఏ కష్టం వచ్చినా అన్నివిధాల ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ఆనం విజయకుమార్‌రెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఏఎంసీ ఛైర్మెన్ పేర్నాటి కోటేశ్వరరెడ్డి, జడ్పీటిసి సభ్యులు మల్లు సుధాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు డాక్టర్ షేక్ సత్తార్, తాళ్లూరు అవినాష్, పార్టీ సీనియర్ నాయకులు స్వర్ణ వెంకయ్య, సిహెచ్ హరిబాబుయాదవ్, చెన్నారెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఏలూరు శివ సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల నిలయంగా.. విద్యారంగం

రాష్ట్రంలో విద్యారంగం సమస్యలకు నిలయంగా మారిపోయిందని, విద్యార్థులకు ప్రభుత్వ విద్య అందనిద్రాక్షగా మారిందని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ (పీఎస్‌యు) నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో పీఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరాయుడు, ఎన్.నరేంద్ర, డి.గోపి, ఏ.చంద్ర, అయ్యన్న, నరేష్, సీపీ నాగేంద్ర, రవితేజ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ అస్తవ్యస్త విధానాలతో ఇప్పటికే వేలాదిమంది విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమయ్యారని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

## నాడు డా. వైఎస్ చేతులమీదుగా ప్రారంభమైన పరిశ్రమకు

# నేడు అంతర్జాతీయస్థాయి గుర్తింపు

- అమెరికా అంతరిక్ష సంస్థకు శ్రీసిటీ-విఆర్‌వి పరిశ్రమ ఉత్పత్తుల ఎగుమతి
- అభినందించిన శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డా.రవీంద్ర సన్నారెడ్డి



దివంగత మహానేత, మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేతులమీదుగా ఒకనాడు ప్రారంభోత్సవం చేసుకున్న పరిశ్రమ.. నేడు అంతర్జాతీయ స్థాయిలో తన సత్తా చాటుకుంటోంది. శ్రీసిటీలోని విఆర్‌వి ఆసియా పసిఫిక్ ప్రైవేట్ పరిశ్రమ, ఇటీవల ఒక ప్రముఖ అమెరికన్ ప్రైవేట్ అంతరిక్ష సంస్థకు పలు భారీ ద్రవ ఆక్సిజన్ నిల్వ ట్యాంకులను ఎగుమతి చేయడం ద్వారా ఒక ముఖ్యమైన మైలురాయిని అధిగమించింది. 37మీటర్ల పొడవు, 6 మీటర్ల వ్యాసం, 200 టన్నుల బరువు కలిగిన ఆ భారీ నిల్వ ట్యాంక్, విఆర్‌వి యొక్క ఇంజనీరింగ్, క్రయోజెనిక్ టెక్నాలజీని అభివృద్ధి చేయడంలో ఆ పరిశ్రమ తన ప్రతిభను చాటి చెప్పింది. దీంతో అంతరిక్షరంగం అవసరాలకు అనుగుణంగా భారీ క్రయోజెనిక్ నిల్వ ట్యాంకుల తయారీలో విఆర్‌వికి ప్రపంచవ్యాప్త గుర్తింపు లభించింది. శ్రీసిటీలో ప్రవేశించిన మొట్ట మొదటి పరిశ్రమ ఇది. ఆగస్టు 8, 2008న, శ్రీసిటీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో, అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ పరిశ్రమ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆ సందర్భాన్ని ఇప్పుడు శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి గుర్తుచేసుకుంటూ, ఆ పరిశ్రమ యాజమాన్యానికి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మనిర్భర్, 'మేక్ ఇన్ ఇండియా' చొరవ మేరకు నిబద్ధత, కృషితో కీలక రంగంలో ఎగుమతులు చేపట్టిన విఆర్‌వి పరిశ్రమ కృషి అభినందనీయమన్నారు. దాదాపు 15 సంవత్సరాలుగా భారీ క్రయోజెనిక్ స్టోరేజీ ట్యాంకులను విఆర్‌వి సంస్థ భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)తో పాటు, మరికొన్ని ప్రతిష్టాత్మక సంస్థలకు సరఫరా చేస్తోందని, 2019 మే నెలలో శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగకేంద్రం-షార్‌కు ద్రవ నైట్రోజన్ షీల్డ్‌తో కూడిన భారీ లిక్విడ్ హైడ్రోజన్ నిల్వ ట్యాంక్‌ను సరఫరా చేయడం ద్వారా ఈ పరిశ్రమ ఒక ప్రత్యేక గుర్తింపును పొందిందని, ఇటీవల విజయవంతమైన 'చంద్రయాన్' ప్రయోగంలోను ఆ కంపెనీ ఉత్పత్తులు వినియోగించడం విశేషమని ఆయన పేర్కొన్నారు. ఏరోస్పేస్ పరిశ్రమ వృద్ధికి తోడ్పడటంతో పాటు, కరోనా సంక్షోభ సమయంలోనూ ఈ పరిశ్రమ కీలక పాత్ర పోషించి దేశవ్యాప్తంగా వైద్యచికిత్సలకు అవసరమైన ఆక్సిజన్ సిలిండర్లు, నిల్వ ట్యాంకులను విఆర్‌వి సరఫరా చేసిందని, శ్రీసిటీ విరాళంగా తిరుపతి స్విమ్స్, బర్డ్, రుయా హాస్పిటల్స్‌తో సహా తిరుపతి-నెల్లూరు జిల్లాల్లోని పలు ప్రభుత్వ ఆసుపత్రులకు అందచేసిన ఆక్సిజన్ నిల్వ ట్యాంకులను సకాలంలో సరఫరా చేసి విఆర్‌వి ఎంతో సహకరించిందని ఆయన వివరించారు. క్రయోజెనిక్ స్టోరేజ్ సొల్యూషన్స్‌లో తమ స్థానాన్ని పటిష్టం చేస్తూ, నాణ్యతతో, అత్యంత నైపుణ్యంతో కూడిన ఉత్పత్తులను ఎగుమతులు చేయడం తమ పరిశ్రమకు గర్వకారణమని విఆర్‌వి మేనేజింగ్ డైరెక్టర్ జివిఎల్ రంగ్నేకర్ చెప్పారు. తమ బృందం, శ్రీసిటీలోని తమ అత్యాధునిక ప్లాంట్‌తో కలసి, ఏరోస్పేస్ పరిశ్రమ అవసరాలను తీర్చడానికి నూతన ఆవిష్కరణలతో ప్రపంచస్థాయి ధీటైన ఉత్పత్తులను అందించడానికి నిబద్ధతతో పనిచేస్తోందని పేర్కొన్నారు.



# బాధితులకు అండగా ఉంటా

## - కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న

ఇటీవల మిచాంగ్ తుఫాన్‌తో ఇబ్బందులకు గురైన కోవూరు నియోజకవర్గంలోని పలు ప్రాంతాల ప్రజలను కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి పరామర్శించారు. కోవూరు మండలంలోని పాటూరు, చంద్రశేఖరపురం, విఘ్నేశ్వరం, ఇనమడుగు గ్రామాల్లో తుఫాను ప్రభావిత ప్రాంతాలలో నాయకులు, అధికారులతో కలసి ఆయన ఇటీవల పర్యటించి తుఫాన్ ఉధృతి వల్ల ప్రమాదకరస్థాయికి చేరుకున్న చెరువులు, కాలువలు, వాగులను, నీట మునిగిన పంటపొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం, పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న కుటుంబాలను పరామర్శించి భోజనం, బిస్కెట్లు పంపిణీ చేశారు.

# సైనిక సంక్షేమనిధికి విరాళాలు ఇవ్వండి



అపారమైన దేశభక్తితో దేశ రక్షణ కోసం సైనికులు చేస్తున్న త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలని, సాయుధ దళాల పతాక నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ప్రజలకు పిలుపునిచ్చారు. సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా ఈనెల 7న జిల్లాలోని సైనికులకు, మాజీ సైనిక కుటుంబాలకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తన వంతు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశం కోసం ప్రాణాలొడ్డిన సాహసోపేతమైన అమర జవానులకు వందనం సమర్పించేందుకు, వారి కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు సాయుధ దళాల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. పతాక నిధికి విరాళాలు సేకరించేందుకు ఎన్‌సిసి విద్యార్థులు నగరంలోని వివిధ ప్రాంతాలకు వస్తారని, సాయుధ దళాల పతాక నిధికి విరివిగా విరాళాలు ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం సిబ్బంది, 10-ఏ సెకండ్ ఆఫీసర్ గుండాల సురేంద్రబాబు, 24-ఏ బెటాలియన్ ఎన్‌సిసి అధికారి బాలబ్రహ్మాచారి, పెంచల ప్రసాద్, మాజీ సైనికుల సంఘం సంక్షేమ అధ్యక్షులు బి.జె రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వ్యాధులు విజృంభించకుండా జాగ్రత్త!

భారీవర్షాల కారణంగా జిల్లాలో వ్యాధులు విజృంభించే అవకాశం ఉంది కనుక వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డా. పెంచలయ్య జిల్లాలోని వైద్యాధికారులకు, సిబ్బందికి సూచించారు. ఈనెల 6న ఆయన ఇందుకూరుపేట మండలంలోని జగదేవిపేట ప్రాథమిక వైద్యఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఎవరూ అలసత్వంతో ఉండొద్దని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, వ్యాధులు పెరగకుండా చర్యలు చేపట్టాలని చెప్పారు. ఆయనవెంట అడిషనల్ డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలీ, జగదేవిపేట వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.




# వైకాపాకు దళితులు గుణపాఠం చెప్పాలి

## 'దళిత శంఖారావం'లో మాజీమంత్రి సోమిరెడ్డి పిలుపు



రాష్ట్రంలో దళితులపై నిరంతరం దాడులుచేస్తూ దళితులను అన్ని విధాలా మోసం చేస్తున్న వైకాపా నేతలకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఇటీవల నెల్లూరులో పెద్దఎత్తున జరిగిన 'దళిత శంఖారావం' సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ, గత నాలుగున్నర సంవత్సరాలుగా దళితులపై వైకాపా వారు చేయని ఘోరం లేదన్నారు. అనేకమందిని హింసించారని, దళితులపై అన్యాయంగా దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, అఘాయిత్యాలకు పాల్పడ్డారని, ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం మరెక్కడా లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో దళితులంతా ఒక్కతాటిపై నిలబడి వైకాపాని ఓడించాలన్నారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలోని తెలుగుదేశం పార్టీతోనే దళితుల అభ్యున్నతి సిద్ధిస్తుందన్నారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్‌రాజు మాట్లాడుతూ, చంద్రబాబునాయుడు పాలనలో దళితుల కోసం ఎస్సీ సబ్‌ప్లాన్ అమలుచేసి కోట్లాది రూపాయలు కేటాయించి దళితుల బాగుకు బాటలు వేశారన్నారు. ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో దళితులను మభ్యపెట్టి అనేక పథకాలను తొలగించి దళితులను అన్ని విధాలా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. దళితులపై దాడులు చేస్తూనే మరోవైపు సామాజిక సాధికార యాత్ర పేరుతో దళితులను వంచిస్తున్నారని, ఇప్పటికైనా దళితులు వాస్తవాలను గ్రహించి, వైకాపా ప్రభుత్వం గద్దె దిగేందుకు నడుంబిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి, ఎస్సీ సెల్ అధ్యక్షులు కాకి ప్రసాద్, తిరుపతి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు డాక్టర్ శ్రీపతిబాబు, ఎస్సీసెల్ నాయకులు మాతంగి కృష్ణ, శైలేంద్రబాబు, మైఖేల్, కువ్వారపు బాలాజీ, విజయ్‌బాబు, గంగాధర్, కిషోర్, రాము తదితరులు పాల్గొన్నారు.

### పర్యాటక అధికారిగా..
# నాగభూషణం

జిల్లా పర్యాటకశాఖ అధికారిగా పనిచేస్తున్న సాయికృష్ణ ఇటీవల తన మాతృశాఖ రెవెన్యూకు వెళ్ళడంతో, ఆ స్థానంలో అన్న మయ్యజిల్లాలో పనిచేస్తున్న నాగభూషణంను పర్యాటకశాఖ ఇన్‌చార్జిగా నియమించారు. గతంలో నెల్లూరులో పర్యాటక అధికారిగా నాగభూషణం పనిచేసివుండడంతో జిల్లా ఆయనకు సుపరిచితమే.

### చిన్నారులకు
# నోట్‌పుస్తకాలు పంపిణీ



నెల్లూరులోని పోస్టల్ కాలనీలో ఇటీవల వైకాపా నేత మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో చిన్నారులకు నోట్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పర్వతరెడ్డి బలరామిరెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని, బలరామిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ట్రస్టీలు ప్రవంతి, సురేష్, వెంకటరమణ, డాక్టర్ మోహన్ కృష్ణారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.




# ఎన్‌బికెఆర్‌లో.. ఎయిడ్స్ ర్యాలీ

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఇటీవల కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఆర్మీ-నేవీ ఎన్‌సిసి క్యాడెట్లు విద్యానగర్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయ్‌కుమార్‌రెడ్డి ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ, యువత హెచ్ఐవి లేదా ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. యువత మరియు విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండి, ఎటువంటి దురలవాట్లు లేకుండా, మంచి ప్రవర్తనతో మెలగాలని, వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఎన్‌సిసి క్యాడెట్లు విద్యానగర్లో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌సిసి ఆఫీసర్లు, లెఫ్టినెంట్ గోవిందు మాధవయ్య, సబ్ లెఫ్టినెంట్ వి.మల్లికార్జునరెడ్డి, శోభారాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉదయ్ కుమార్ రాజు, విభాగాధిపతి డాక్టర్ సి.రవీందర్‌రెడ్డి, ఎన్‌సిసి క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# జేవీవీ ఆధ్వర్యంలో.. వైద్యశిబిరం

డా.జెట్టి శేషారెడ్డి స్మారక ట్రస్టు, జనవిజ్ఞానవేదిక-ఆత్మకూరు మండల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 3న ఆత్మకూరులోని షిర్డీసాయిరాం జూనియర్ కళాశాల ప్రాంగణంలో వైద్యశిబిరం నిర్వహించి రోగులకు ఆరోగ్యపరీక్షలు చేశారు. రోగులకు మందులు పంపిణీచేశారు. డా.రామచంద్రారెడ్డి వైద్యశాల వైద్యులు ఎంవి రమణయ్య, జేవీవీ నాయకులు షేక్ సందాని, మురళీకృష్ణ తదితరులు పర్యవేక్షించారు. గత పదేళ్ళుగా నెల్లూరు, కావలి, ఆత్మకూరు పట్టణాల్లో సేవాభావంతో వైద్యశిబిరాలు నిర్వహించి, ఇటీవల దివంగతులైన కృష్ణారావు చిత్రపటానికి ఈ సందర్భంగా జేవీవీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆత్మకూరు జేవీవీ అధ్యక్షుడు మల్లికార్జున, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళి, కళాశాల అధ్యాపకులు రమణారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు లక్కు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లా గూడూరు డివిజన్

# యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు



మిచాంగ్ తుఫాను జిల్లాను అతులాకుతలం చేసిందని, అన్నీ శాఖల అధికారులు యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపడుతున్నారని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, స్వచ్ఛాంధ్ర చైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని పురపాలక కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఇటీవల వారు తుఫాను ప్రభావంపై సమీక్షించారు. ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి వాకాడు మండలంలో ఏరియల్ సర్వే చేపడతారని, నష్టపోయిన వారందరినీ ఆదుకోవడం జరుగుతుందని తెలిపారు. వాటర్ ప్లాంట్‌ల నిర్వాహకులు తాగునీటిని అధిక మొత్తానికి విక్రయిస్తున్నారని, నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఆదేశించామని ఆయన వివరించారు. నాయకులు బొమిడి శ్రీనివాసులు, కోడూరు మీరారెడ్డి, బత్తిని విజయకుమార్, అజీజ్‌ఖాన్, మురళి, అల్తాఫ్, కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# కూలీల కుటుంబాలను ఆదుకున్న కందలి సర్పంచ్



తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురవడంతో చెరువులు, గుంటలు నిండిపోయి, రోడ్లుమీద సైతం నీళ్ల ప్రవహించడంతో జనజీవనం చాలావరకు స్తంభించిపోయింది. గూడూరు మండలం, కందలి గ్రామానికి సవక కూలీలుగా వచ్చి, వరదలో చిక్కుకుపోవడంతో ఆ గ్రామ సర్పంచ్ బల్లి వెంకటేశ్వర్లు, గ్రామంలోని యువకులతో కలసి ఆ కూలీలను కందలి ప్రభుత్వ పాఠశాల వద్దకు సురక్షితంగా చేర్చారు. దాదాపు 30 కుటుంబాలకు భోజన వసతి కూడా కల్పించారు. సచివాలయ కన్వీనర్ నవశేఖర్, వేమయ్య,, శివ, మహేష్, తలారి రామయ్య ఈ సహాయక కార్యక్రమంలో పాల్గొన్నారు.

# క్రీడాకారునికి రోటరీ సన్మానం




అంతర్‌రాష్ట్ర దివ్యాంగుల షాట్‌పుట్ పోటీల్లో బంగారు పతకం, జావలిన్ త్రో పోటీలలో రజిత పతకాలను సాధించిన గూడూరుకు చెందిన కరేటి అన్వేష్‌ను గూడూరు రోటరీ వెస్ట్ క్లబ్ ఘనంగా సన్మానించింది. స్థానిక డివిఆర్ కమ్యూనిటీ హాల్లో ఇటీవల జరిగిన ఈ కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న సీనియర్ రొటేరియన్, వైసిపి నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అన్వేష్ షాట్‌పుట్, జావలిన్ త్రో పోటీలలో పతకాలను సాధించడమే కాకుండా, దివ్యాంగుల క్రికెట్‌లోనూ రాణిస్తుండడం స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం క్లబ్ సభ్యుల ఆర్థిక సహకారంతో పదివేల రూపాయలు అందించి అన్వేష్‌ను సన్మానించారు. క్లబ్ అధ్యక్షులు సనత్‌కుమార్‌రెడ్డి, ఆడిటర్ రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

# బాబా సాహెబ్‌కు న్యాయవాదుల నివాళి



గూడూరు న్యాయస్థానంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 68వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అరవ పార్వతయ్య మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాలకు బి.ఆర్ అంబేద్కర్ ఆశాజ్యోతిగా నిలిచారని కొనియాడారు. వి.పెంచలయ్య, మనోహర్, బియ్యం చంద్రశేఖర్, కె.చంద్రశేఖర్, ఎం.విజయ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# జలదిగ్బంధంలో గూడూరు

తుఫాను కారణంగా గూడూరు - రాజంపేట, గూడూరు - వెంకటగిరి, విందూరు - పంబలేరు రహదారులపై భారీగా వరదనీరు రావడంతో రాకపోకలు స్తంభించాయి. చెన్నూరు కటాలమ్మ దేవాలయం వద్ద రోడ్డుపై మూడు అడుగుల మేర నీరు ప్రవహించడంతో పోలీసులు ఆ మార్గంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. తిరుపతి, రాజంపేట, వెంకటగిరి ప్రాంతాల్లోని 100 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గూడూరు పట్టణం జలమయం అయ్యింది. ఆర్టీసీ డిపో పూర్తిగా నీట మునిగిపోవడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గూడూరు పట్టణంలోని శివాలయంవీధిలో విద్యుత్ స్తంభంపై చెట్టు పడడంతో వైర్లు తెగిపోయాయి.

## మా వాహనాలు ఎక్కడ?

తుఫాన్ ప్రభావంతో గూడూరు ఆర్టీసీ బస్టాండ్ పార్కింగ్ స్థలం నీటితో మునిగిపోవడంతో అక్కడ పార్కింగ్ చేసిన తమ వాహనాలు కనపడక ప్రయాణీకులు ఆందోళన చెందుతున్నారు. వాహనాలు కనపడని వారు నీటిలో కొట్టుకుపోయాయేమోనని భయపడుతున్నారు. కాగా, ఆర్టీసీ బస్టాండు పూర్తిగా నీట మునగడంతో, బస్సులను పాత బస్టాండ్‌కు చేర్చడం జరిగిందని ఆర్టీసీ వర్గాలు తెలిపాయి.

## బాధితులకు న్యాయం చేయాలి

గూడూరు నియోజకవర్గంలో తుపాను ధాటికి నష్టపోయిన రైతులు, ఆక్వా రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ కోరారు. ఆయన 5వ తేదీ మండలంలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.

# ఘరానా దొంగ దొరికాడు

## రూ. 10లక్షల విలువచేసే 22 బైక్‌లు స్వాధీనం



జల్సాలకు అలవాటుపడి, దొరికిన బైక్‌నల్లా అపహరించుకుపోతున్న ఓ ఘరానా దొంగ ఎట్టకేలకు పోలీసులకు దొరికిపోయాడు. నిందితుడిని అరెస్ట్ చేసి, 10.04 లక్షల రూపాయలు విలువచేసే 22 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. జిల్లా ఎస్పీ డా. కె.తిరుమలేశ్వరరెడ్డి ఇటీవల నెల్లూరులోని ఉమేష్ చంద్ర సమావేశం హాలులో విలేకర్లకు ఆ వివరాలు వెల్లడించారు. చిల్లకూరు మండలం తమ్మినపట్నం గ్రామానికి చెందిన నేలపూడి మల్లికార్జునయాదవ్ అలియాస్ మల్లి మారుతాళాలతో బైక్‌లను అపహరించి వాటిని ఇతర ప్రాంతాల్లో తక్కువ ధరకే అమ్మేసి, ఆ డబ్బుతో జల్సాలు చేసేవాడని, కొంతకాలం క్రితం నెల్లూరు సమీపంలోని కొత్తూరులో ఉంటూ, జిల్లాలోని పలుప్రాంతాల్లో చోరీలు చేశాడని ఎస్పీ తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ బైక్ దొంగతనం కేసులో విచారణ సందర్భంగా, స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి నిందితుని ఆనవాళ్ళు కనిపెట్టారని, నెల్లూరు రూరల్ డిఎస్పీ వీరాంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో ఇన్స్‌పెక్టర్ పి.శ్రీనివాసులురెడ్డి ప్రత్యేక పోలీసు బృందాలతో, సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడిని గుర్తించి, గాలింపు చేపట్టి కాకుపల్లి దగ్గర అరెస్ట్ చేశారని చెప్పారు. పలు ప్రాంతాల్లో అపహరించిన 22 బైక్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సందర్భంగా రూరల్ పోలీసు అధికారులను, సిబ్బందిని ఆయన అభినందించారు.

# కక్ష తీర్చుకున్న కాంగ్రెస్!

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించిన వీరుడిగా... భారీ ప్రచారాల మధ్య, తన టీఆర్ఎస్ పార్టీతో స్వయంగా 2014లో ఎన్నికల బరిలో నిలబడి, అధికారం చేపట్టిన కల్వకుంట్ల చంద్రశేఖరరావు 'దెబ్బకు' ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్టానం షాక్ అయింది. తెలంగాణ కాంగ్రెస్ కకావికలై పోయింది.

తెలంగాణ ఇస్తే, టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనం చేస్తామని, మొదటి ముఖ్యమంత్రిగా తనకే అవకాశం ఇవ్వాలని చంద్రశేఖరరావు సోనియాగాంధీకి విన్నవించారంటూ అప్పట్లో వార్తలు వచ్చాయి. ఆ పిచ్చి తల్లి నమ్మేసింది. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇవ్వాలని నిర్ణయించేసింది. రాయలసీమకు హైదరాబాద్ బాగా దగ్గరని, తమను తెలంగాణలో కలపాలని జేసీ దివాకర్‌రెడ్డి లాంటి పలువురు రాయలసీమ నేతలు నెత్తి నోరు కొట్టుకున్నారు. ఢిల్లీ దర్బార్‌కు విన్నవించారు. దీనికి కేసీఆర్... నో అన్నారు. అందువల్ల సోనియమ్మ కూడా నో అన్నట్టు వార్తలు వచ్చాయి. హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిని చెయ్యాలని ఆంధ్ర నాయకులు ప్రాధేయపడ్డారు. కేసీఆర్... నో అన్నారు. అందుకని సోనియమ్మ కూడా నో అన్నారు. పార్లమెంట్‌లో బిల్ ప్రవేశపెట్టారు. కేసీఆర్ వెళ్ళలేదు. దాని తలుపులు మూసేశారు. సభ్యుల మైకులు... "సాంకేతిక కారణాల" వల్ల పని చేయలేదు. బిల్లు పాస్ అయింది అన్నారు. కేసీఆర్ సకుటుంబ, సపరివార సమేతంగా ఢిల్లీ వెళ్ళి సోనియమ్మను కలిసి కృతజ్ఞతలు తెలిపివచ్చారు.



తెలంగాణ ఇచ్చాముగా.... మీ పార్టీని మా పార్టీలో కలుపు అన్నారు, ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలు. "నేనెప్పుడన్నాను? మీరే అనుకున్నారు...." అన్నట్టుగా కేసీఆర్ నాలుక మడతేశారు. కాంగ్రెస్ పెద్దలు బిత్తరపోయారు. కక్కలేక, మింగలేక.... కాంగ్రెస్ నేతలు గిలగిలలాడిపోయారు.

తెలంగాణ సాధించిన వీరుడిగా 2014 తెలంగాణ ఎన్నికల ఫలితాలను కేసీఆర్ కుటుంబం ఎగరేసుకుపోతే కాంగ్రెస్ నాయకులు గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయారు. 2014 పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కూడా... గుడిని మింగే వాళ్ళు పోయి, గుడినీ, గుళ్లో లింగాన్ని మింగేవారు వచ్చారు అన్నట్టుగా కాంగ్రెస్ పెత్తందారులు పోయి, బీజేపీ పెత్తందారులు వచ్చారు. దాంతో, కేసీఆర్‌ను ఏమి చేయడానికీ కాంగ్రెస్‌కు పాలుపోలేదు.

ఇక్కడ తెలంగాణలో కాంగ్రెస్‌పార్టీని కబళించే పనిలో కేసీఆర్ పడ్డారు.

"తెలంగాణ ఇచ్చింది మేమేరా బాబూ! కేసీఆర్ కాదు..." అని గట్టిగా చెప్పగలిగిన నాయకుడు కాంగ్రెస్‌లో లేకుండా పోయారు.

కేసీఆర్ మైకంలో పడి, కాంగ్రెస్‌ను తెలంగాణ జనం పట్టించుకోలేదు.

కేసీఆర్‌లోని అహంకారం బయటకు వచ్చేసింది అన్నట్టుగా, అన్ని రకాల ఆరోపణలు వెల్లువెత్తడం మొదలైంది. ఆయనకు మనుషులు కనపడడం మానేశారు. కేసీఆర్ కూతురు కవిత కూడా గమ్మత్తుగా నాయకురాలైపోయింది. తెలంగాణ జాగృతి పేరిట ఆమె అటునుంచి నరుక్కురావడం మొదలుపెట్టారు. కుమారుడు ఒక మంత్రి, మేనల్లుడు ఒక మంత్రి, ఇంకో మేనల్లుడు ఒక ఎం.పీ అయిపోయారు. అందరూ "పని"లో పడి బిజీ అయిపోయారు.

తెలంగాణ ఇచ్చారు కదాని, కాంగ్రెస్‌లో చేరి ఉంటే... కేసీఆర్ కుటుంబం అన్యాయమై పోయి ఉండేది గదా అంటూ కొందరు విమర్శకులు జోకులు కూడా వేశారు.

తెలంగాణలో కేసీఆర్ కుటుంబం వీర విహారం చేస్తూ వచ్చింది. రాజకీయ స్వైర విహారం చేసింది. కాంగ్రెస్‌ను నిర్వీర్యం చేయడానికి సకల ప్రయత్నాలు చేశారు. ఎవరో "పుట్టు కాంగ్రెస్" వాదులు, భట్టి విక్రమార్క లాంటి నలుగురైదుగురు మాత్రం మిగిలారు. తెలుగుదేశం పార్టీనైతే నేలమట్టం చేసేశారు.

నిజానికి, మొదటి టర్మ్ అంతానికే బాగా దుర్వాసన వచ్చేసింది. కేసీఆర్ అరాచకాల దెబ్బకు తెలంగాణలో కాంగ్రెస్ బాగా పుంజుకుంది. ఎంత పుంజుకుందీ అంటే... 2018లో కేసీఆర్ పార్టీకి 20, 25 సీట్లు వస్తే చాలా గొప్ప అన్న విశ్లేషణలు వెలువడ్డాయి కూడా.

కానీ, ఎన్నికలు ముగిశాక చూస్తే, కేసీఆర్ పార్టీకి ఏకంగా 88 సీట్లు వచ్చాయి. కలయో.... ఈవీఎంల మాయో విశ్లేషకులకు అర్థం కాలేదు. కాంగ్రెస్ నేతలు కుపితులైపోయారు.

నల్గొండ జిల్లాకు చెందిన సీనియర్ నేత ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆ ఎన్నికల ముందు టీపీసీసీ అధ్యక్షుడుగా ఉన్నారు. 2018లో కాంగ్రెస్ గెలుపు ఖాయం అని చాలామంది నమ్మినట్టే, ఆయన కూడా బలంగా నమ్మారు. "టీఆర్ఎస్‌ను ఓడించేదాకా గెడ్డం గీయను..." అంటూ ఆయన భీష్మ ప్రతిజ్ఞ ఒకటి చేశారు.... (ఇక ఓ నెల రోజులే గదా అనుకుని).

ఆయన ప్రతిజ్ఞ చూసి, బ్యాలెట్ బాక్స్‌లు పకా పకా నవ్వేశాయి. టీఆర్ఎస్‌కు ఏకంగా 88 సీట్లు వచ్చాయి. అప్పటి నుంచి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి గెడ్డం గీయలేదు. ఏదో.... గాద్రెజ్ కలర్‌తో మేనేజ్ అయిపోతున్నారు. (ఇక ఇప్పుడు గెడ్డం గీసి, ట్రిమ్‌గా తయారవుతారేమో చూడాలి.)






కేసీఆర్, వారి కుమార్తె కవిత, ఇతర సమీప బంధువులకు ఎదురులేకుండా పోయింది. తెలంగాణ పేరు చెప్పి శుభ్రంగా ఊడ్చేసి, కల్లాపు జల్లి, ముగ్గులు పెడుతున్నారనే ఆరోపణలు హైదరాబాద్ నుంచి ఢిల్లీ దాకా హోరెత్తిపోయాయి. తమకు 'హ్యాండ్' ఇచ్చిన కేసీఆర్ & కోను ఏమి చేయాలో కాంగ్రెస్‌కు పాలు పోవడం లేదు. ముంతలో ఉన్న ఆంధ్రను వదిలేసుకుని, మబ్బుల్లో ఉన్న కేసీఆర్‌ను నమ్ముకున్న సోనియమ్మకు ఉభయ భ్రష్టత్వం సంప్రాప్తించింది.

సునీల్ గవాస్కర్, అజారుద్దీన్, రాహుల్ ద్రావిడ్, వీవీఎస్ లక్ష్మణ్, సౌరబ్ గంగూలీ, కపిల్‌దేవ్ లాంటి దిగ్గజ ఆటగాళ్లు ఉన్నప్పటికీ, వాళ్ళను పెట్టి క్రికెట్ మ్యాచ్ ఆడలేమనే విషయం ఢిల్లీ కాంగ్రెస్‌కు అప్పటికి తెలిసి వచ్చింది. విరాట్ కోహ్లీ లాంటి ఆటగాడి కోసం వెదుకులాట మొదలైంది.

తెలంగాణలో పాతుకుపోయి ఉన్న మొండి కత్తుల్లాంటి కాంగ్రెస్ నాయకుల వల్ల కేసీఆర్‌కు గుణపాఠం చెప్పడం అయ్యేపని కాదని కాంగ్రెస్‌కు అర్థమయింది. ఓ చాకు లాంటి యువనేత కోసం వెదుకుతుంటే, 7ఓ క్లాక్ బ్లేడ్ లాంటి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పెద్దలకు తగిలారు. కేసీఆర్‌ను దెబ్బకు దెబ్బ తీయడానికి రేవంత్‌రెడ్డే తగినవాడు అనే భావనకు 2017లోనే కాంగ్రెస్ పెద్దలు వచ్చారని ఒక "వృత్తి వీడియో విశ్లేషకుడు" ఒక వీడియోలో చెప్పారు కూడా.

ఈ రేవంత్‌రెడ్డితో ఎప్పటికైనా ప్రమాదమే అని భావించిన కేసీఆర్ 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్‌పై హమాస్‌పై ఇజ్రాయెల్ పడిపోయినట్టుగా పడిపోయారు. రేవంత్ ఓడిపోయారు. అప్పటికి, అసెంబ్లీలో రేవంత్ మొహం చూడాల్సిన బాధ కేసీఆర్‌కు తప్పింది. కానీ, విధి బలీయం అన్నారు కదా! 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి రేవంత్ కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచి, టీఆర్ఎస్‌ను కలవరపాటుకు గురిచేశారు.

కాంగ్రెస్‌లో రేవంత్ చేరి ఆరేడు సంవత్సరాలు కాకపోయినప్పటికీ పీసీసీ అధ్యక్ష పదవి అప్పగించినప్పుడే "ఇక నీదే భారం రేవంత్" అని రాహుల్ గాంధీ రేవంత్‌తో అన్నారు.

కాంగ్రెస్‌కూ, రేవంత్‌కూ కూడా ఉమ్మడి శత్రువు కేసీఆర్. దాంతో, కాంగ్రెస్ ఢిల్లీపెద్దలు ఇచ్చిన దన్నుతో ఆకాశమే హద్దుగా రేవంత్ చెలరేగిపోయారు.

- ఒక్కసారిగా తెలంగాణ అంతటా కాంగ్రెస్ మేఘాలు కమ్ముకున్నాయి. ఉద్యోగం, సజ్జోగం లేని యువత ఉప్పొంగింది. ఈసారి కాంగ్రెస్ ఖాయం అనే నోటి ప్రచారం తెలంగాణ మొత్తం చుట్టేసింది.
- కేసీఆర్ కుటుంబంపై అక్రమ సంపాదన ఆరోపణలు వెల్లువెత్తాయి. వరదలై తెలంగాణ పౌర సమాజాన్ని ముంచెత్తాయి
- కేసీఆర్ కూతురు కవితపై ఢిల్లీ మద్యం కేసు ఆరోపణలు వీటికి పరాకాష్ట. "ఏం? మద్యం కుంభకోణాలు మీ మగవాళ్లేనా చేసేది? మేం మహిళలం చేయలేమా?!" అన్నట్టుగా ఆమె పేరు ఢిల్లీ మద్యం కేసులో మారుమోగిపోయింది. తెలంగాణ పౌర సమాజం షాక్ అయింది.
- బీజేపీ వ్యూహాత్మకంగా కేసీఆర్‌ను ముగ్గులోకి లాగింది. కవితను అరెస్ట్ చేయకుండానే కేసీఆర్‌ను నైతికంగా దెబ్బతీసింది. దీనికి కృతజ్ఞతగా కేసీఆర్ స్వరం మూగబోయింది. ఎన్నికల ప్రచారంలో బీజేపీని పల్లెత్తు మాట అనలేదు. ఫలితంగా ముక్కోణపు పోటీ స్థానంలో, కాంగ్రెస్ – కేసీఆర్ ముఖాముఖీ పోటీ జరిగింది.
- కేసీఆర్ పార్టీ 39 స్థానాలతో సరిపెట్టుకోవలసి వచ్చింది. ఇది కేసీఆర్ జన్మలో ఊహించని ఫలితం. తానే... తెలంగాణ, తెలంగాణ అంటే.. తానే అని జనాలు అనుకుంటారని ఆయన భ్రమిస్తూ వచ్చారు. ఆయన రాజకీయానికి కామారెడ్డి ఓటర్లు ఫుల్‌స్టాపు పెట్టడంతో కేసీఆర్‌కు తత్వం బోధపడింది.
- ఆయన కామారెడ్డిలోనూ, తెలంగాణలోనూ ఓడిపోవడం ఒక షాకు అయితే, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం ఇంకో పెద్ద షాకు. ఆయనను జైలుకు పంపించిన కేసీఆర్ గానీ, ఆయన పార్టీ సభ్యులు గానీ రేవంత్‌ను కలవాలి అంటే, ముందుగా అపాయింట్‌మెంట్ ఉండాలి.

కేసీఆర్ తనకు చేసిన ద్రోహానికి, కాంగ్రెస్‌పార్టీ ఇప్పుడు సగం కక్షే తీర్చుకుందని పరిశీలకులు అంటున్నారు. ఇక, కేసీఆర్ పార్టీ టికెట్‌పై గెలిచిన వారిలో ఇరవై మందికి తక్కువ లేకుండా కాంగ్రెస్‌లోకి రేవంత్ లాగేస్తారనే అంచనాలు భారీగా ఉన్నాయి. అది జరిగిననాడు, కాంగ్రెస్ కక్ష, కసి చల్లారినట్టు అని ఒక కాంగ్రెస్ ప్రముఖుడు అన్నారు.

బీజేపీ కూడా రంగంలోకి దిగి, మిగిలిన వారిలో 11 మందికి తక్కువ లేకుండా లాగేయవచ్చు. 12 మంది సభ్యులు (మొత్తం సభ్యుల సంఖ్యలో పది శాతం) ఉంటే, ప్రధాన ప్రతిపక్ష హోదా లభిస్తుంది. బీజేపీకి సొంతంగా 8 సీట్లు ఉన్నాయి. మరో 4 షార్టు అన్నమాట.


ఈ విధంగా అటు కాంగ్రెస్, ఇటు బీజేపీ కేసీఆర్ పార్టీని నిర్వీర్యం చేయడం వచ్చే ఆరేడు నెలల్లో జరిగిపోవచ్చు. అప్పటికి గానీ, కాంగ్రెస్ కడుపు మంట చల్లారదు అని కొందరు సీనియర్ జర్నలిస్టులు సైతం వ్యాఖ్యానిస్తున్నారు.

కేసీఆర్ రాజకీయం దాదాపుగా ముగిసింది. వచ్చే ఎన్నికల్లో... కాంగ్రెస్, బీజేపీ మాత్రమే తలపడతాయి అనేది విశ్లేషకుల అంచనా. ఇక బీఆర్ఎస్ చరిత్ర ముగించడానికి... రేవంత్‌రెడ్డి రేపటి నుంచి బిజీ అయిపోతారు.

అదే సోనియాకు తెలంగాణ కాంగ్రెస్ ఇచ్చే కానుక అని కాంగ్రెస్ పెద్దాయన ఒకరు వ్యాఖ్యానించారు.

**- భోగాది వేంకట రాయుడు**
bhogadirayudu2152@gmail.com

# కళ్యాణ వైభవం...!



అనపల్లి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి - చందుషల కుమార్తె సాయి చరిత - సాయి అభినయ్ (విడవలూరు వెంకట వేణుగోపాల కృష్ణారెడ్డి - ఉమామహేశ్వరిల కుమారుడు)ల కళ్యాణం నవంబర్ 22వ తేదీ నెల్లూరులోని కేజీకే కళ్యాణ మండపంలో జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాశీస్సులు.

# సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం

## - సిపిఎం నాయకుల విమర్శ



తుఫాన్ బాధితులను ఆదుకోవ డంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని సిపిఎం జిల్లా నాయకులు మూలం రమేష్ విమర్శించారు. ఈనెల 7న నెల్లూరులోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో పంటపొలాలు బాగా దెబ్బతిన్నాయని, రైతులను ఆదు కునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. తుఫాన్ దెబ్బకు నెల్లూరుజిల్లా కకావికలమైందని, పూర్తిస్థాయిలో నేటికీ సహాయ చర్యలు అందడం లేదని అన్నారు. తుఫాన్ బాధితులకు ప్రభుత్వం రూ.2500 సాయం ప్రకటించినా అది అర్హులైన వారందరికీ సక్రమంగా అందడం లేదన్నారు. తుఫాన్ ధాటికి కూలిపోయిన ఇంటికి రూ. 20వేలు, పాక్షికంగా దెబ్బతిన్నవాటికి రూ.10వేలు, ఇళ్లల్లోకి నీళ్లొచ్చి ఇబ్బందులు పడుతున్నవారికి రూ.5 వేల వంతున సాయం అందించాలని కోరారు. పంటలు దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.30వేలు పరిహారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, శ్రీనివాసులు, షేక్ మస్తాన్‌బీ, నాగేశ్వరరావు, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పంతా కరిగిపోయింది

## ➤ కన్నీరు పెట్టుకున్న రైతులు



తుఫాన్ దెబ్బకు ఉప్పుకొటార్లలోని ఉప్పు గుట్టలన్నీ కరిగిపోయాయి. భారీ వర్షాలు బాధలే మిగిలించాయి.. ప్రభుత్వం కనికరించి ఆదుకోవాలంటూ అల్లూరు మండలం ఇస్కపల్లి పంచాయ తీలోని శంభునిపాలెం ఉప్పురైతులు గోడుగోడుమంటున్నారు. ఈనెల 6న వారు ఉప్పుకొటార్లలో దిగి కరిగిపోయిన ఉప్పును చూపిస్తూ ఆవేదనకు గురయ్యారు. లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టుకుని బోర్లు వేసుకుని తయారు చేసుకున్న ఉప్పంతా నీళ్లపాలైందని, గత ఆరునెలలుగా 108 ఎకరాల శంభన్ సాల్ట్‌సొసైటీద్వారా తయారు చేసిన ఉప్పంతా నీళ్లలో కలిసిపోయిందని వారు కన్నీటిపర్యంతమయ్యారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి నష్టపోయిన ఉప్పురైతులకు ప్రభుత్వం ద్వారా తగు సాయం అందించాలని వారు కోరుతున్నారు.

# మేమున్నాం.. ఆదుకుంటాం!

మిచాంగ్ తుఫాన్ బాధితులు అధైర్యపడవద్దని, కష్టాల్లో ఆదుకునేందుకు తామున్నామని నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఈనెల 6న నెల్లూరు రూరల్‌లోని 31వ డివిజన్ రామకోటయ్యనగర్ ప్రాంతాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు. వరదనీటితో ఇబ్బందులు పడుతున్న వారందరికీ ప్రభుత్వం నుంచి సాయం అందుతుందని చెప్పారు. ఈ విషయమై ఇప్పటికే కలెక్టర్ తదితర అధికారులతో మాట్లాడానని తెలిపారు. బాధితులకు ఏ ఒక్కరికీ అన్యాయం జరగకుండా చూస్తామన్నారు. ఈ ప్రాంతాల్లో తరచూ వచ్చే వరద ముంపు సమస్యను శాశ్వత ప్రాతిపదికపై పరిష్కరించేందుకు కృషిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదాలతో పాటు విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి చారిటీస్‌లో.. న్యాయవిజ్ఞాన సదస్సు

ప్రపంచ మానసిక వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరులోని ప్రగతి చారిటీస్‌లో ఈనెల 3న న్యాయ విజ్ఞానసదస్సు నిర్వహించారు. జిల్లా జడ్జి సి.యామిని ఆదేశాలతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కన్వీనర్.. సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ చారిటీస్‌లో పిల్లలకు వసతులు ఎలా ఉన్నాయో పరిశీలించారు. మానసిక వికలాంగులైన ఆ బాలలకు మనోధైర్యాన్ని కలిగించారు. చారిటీస్ నిర్వాహకులు సుశీల, సిబ్బంది పాల్గొన్నారు.

# జగన్ జాగ్రత్త పడతారా?

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్య నాయకుడు సంతోషంగా చెప్పారు. దీనికితోడు ఏపి కారణాలు కేసీఆర్ రాజకీయానికి ముగింపు పలికాయో, ఆయా కారణాలకు జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన రాజకీయ పరివారం దూరంగా ఉండవలసిన అవసరాన్ని కొందరు వైసీపీ నాయకులు సైతం అంతర్గత సంభాషణల్లో ప్రస్తావిస్తున్నారు.


ప్రజలు, మీడియా, పార్టీ నాయకులతో పూర్తిగా డిస్కనెక్ట్ అయిపోవడం, ఏ విషయాన్ని అయినా సలహా దారు సజ్జల చేత మాట్లాడింపచేయడం, ప్రభుత్వంపై పుంఖాను పుంఖాలుగా వెల్లువెత్తే ఆరోపణలకు సైతం ప్రభుత్వ స్పందన లేకపోవడం, జనం ఎక్కడ మరిచి పోతారో అన్నట్టుగా... పార్టీ నాయకులు, మంత్రులు తామే చంద్రబాబు చాలీసా చదవడం, వివిధ వర్గాల అణచివేత చర్యలు, చిన్న పెద్ద అన్న తేడా లేకుండా ప్రతి విషయంలోనూ పోలీసుశాఖను ప్రయోగించడం, మొదలైన అనేకానేక అంశాలలో జగన్ పోకడని, పరి పాలనని, మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి వ్యవహార శైలితో జనం పోల్చి చూస్తున్నారనే విషయాన్ని వైసీపీ నేతలు కూడా అంగీకరిస్తున్నారు. "అప్రజాస్వామిక" పోకడలకు పోయినందుకే కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు ఫామ్‌హౌస్‌కు పంపించేశారు. కాబట్టి ఈ తీర్పును ఆంధ్ర ముఖ్యమంత్రి పరిగణనలోకి తీసుకో వలసిన అవసరం ఉందన్నది విశ్లేషకుల అభిప్రాయం. రాజకీయంగా హిమాలయాలంత ఎత్తుకు ఎదిగిన కేసీఆర్ ఇమేజ్‌ని ప్రజలు ఒక్కసారిగా పక్కనపెట్టేశారు.

## సంక్షేమ పథకాలే ఆదుకోవు...

"సంక్షేమ పథకాలు" పేరిట ప్రజల ఉమ్మడి సొమ్మును పప్పు, బెల్లాలాగా ఉదారంగా పంచిపెట్టే విషసంస్కృతి 1980 దశకం నుంచే మొదలైంది. డాక్టర్ చెన్నారెడ్డితో మొదలుపెట్టి, "సంక్షేమ" పథకాలు అమలుచేయని ముఖ్యమంత్రి మన రాష్ట్రంలో ఎవరూ లేరు. ఇప్పుడు అది పరాకాష్టకు చేరిందనే భావనలు సమాజంలో గట్టిగా వ్యక్తం అవుతున్నాయి.

తెలంగాణ ముఖ్యమంత్రి కూడా లక్షల కోట్లు ఒలకబోసినా, జనం తిరస్కరించారు. "ఎవరు వచ్చినా సంక్షేమ పథకాలు ఇస్తారు" అనే భావన జనంలో స్థిరపడిపోయింది. ఈ విషయాన్ని కూడా జగన్ పరి గణనలోకి తీసుకోవాల్సి ఉంటుందని విశ్లేషకులు అంటున్నారు.

ఎన్ని "సంక్షేమ" కార్యక్రమాలు చేపట్టినప్పటికీ, ముఖ్యమంత్రి పదవిలో ఉన్నవారి వ్యవహారశైలిలో నిజాయితీ, చిత్తశుద్ధి, ప్రజాసేవ పట్ల అంకితభావం జనానికి కనిపించకపోతే ఆ సంక్షేమ పథకాలన్నీ బూడిదలో పోసిన పన్నీరే అవుతాయని కేసీఆర్ కథ చూస్తే అర్థం అవుతుంది. ఈ ఎన్నికల నుంచి, గుణ పాఠాలు నేర్చుకోదలిచిన పార్టీలకు నేర్చుకున్నన్ని ఉన్నాయని ఒక సీనియర్ నేత అన్నారు. "ఫీల్‌గుడ్" ఫ్యాక్టర్ ఒక్కటే ఏ పార్టీని అయినా అధికారంలోకి తీసుకొస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. మరి, వైసీపీ ప్రభుత్వ వ్యవహారశైలిపై ప్రజల్లో "ఫీల్‌గుడ్" ఫ్యాక్టర్ ఉందా..? లేదా అన్న విషయం 2024లో ప్రజలు ఇచ్చే తీర్పును బట్టి ఉంటుంది...!



## నెరవేరిన చంద్రబాబు మొదటి లక్ష్యం!

తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడికి ప్రధానంగా రెండు రాజకీయ లక్ష్యాలు ఉన్నాయి. తనను హైదరాబాద్ నుంచి వెళ్లగొట్టినంత పనిచేసిన పూర్వపు టీడీపీ నాయకుడైన కల్వకుంట్ల చంద్రశేఖర రావును హైదరాబాద్ నుంచి శాశ్వతంగా ఫామ్ హౌస్‌కు పంపించడం ఒక లక్ష్యం. అందుకోసం.. "అనువుగాని చోట అధికుడను..." అనకుండా, పది సంవత్సరాలు ఓపికపట్టారు. బీఆర్ఎస్ చేతిలో అవమానాలు ఎదుర్కొన్నారు.

తెలంగాణ ప్రాంతంలో టీడీపీని పునరుజ్జీవింప చేయడానికి నిశ్శబ్దంగా అనేక చర్యలు తీసుకున్నారు. చెల్లాచెదురై ఉన్న కేడర్‌ను సమీకరించారు. తెలంగాణ ఎన్నికల్లో పోటీచేస్తే, కనీసం 10, 15 సీట్లు టీడీపీ గెలవడం ఖాయమనే పరిస్థితులను కల్పించారు. అయితే చివరి నిముషంలో అత్యంత చాకచక్యంగా వ్యవహరించి ఎన్నికల బరి నుంచి తప్పుకున్నారు.

ఇదొక వ్యూహాత్మక రాజకీయ ఎత్తుగడ. ప్రత్యర్థు లకు దిమ్మ తిరిగే నిర్ణయం. ఈ నిర్ణయంతో కేసీఆర్ వ్యతిరేక ఓటులో చీలికని నివారించారు. ఫలితంగా కాంగ్రెస్ రెండు శాతం ఓట్ల ఆధిక్యతతో కేసీఆర్ పార్టీపై విజయం సాధించింది. ఆ విధంగా కేసీఆర్ రాజకీయానికి చంద్రబాబు చరమగీతం పాడారు.

ఇప్పుడు ఆయన ముందుంది మరో టార్గెట్. ఎలాగైనా ఆంధ్రలో మళ్లీ అధికారం సాధించడం. ఇది అంత ఈజీ కాదు. తెలంగాణలో ఆయన అను కున్నది సాధించడానికి పరోక్షంగా అనేక శక్తులు పనిచేశాయి. లోపాయికారి ఒప్పందంతో బిఆర్ఎస్ సహాయం చేయాలన్న భాజపా ఆలోచన ఆ పార్టీకి భారీ నష్టం కలిగించడమే కాకుండా కాంగ్రెస్‌కి కలి సొచ్చేలా చేసింది. అక్కడ యుద్ధం మూడు ప్రధాన పార్టీల మధ్య అన్నట్టుగా జరిగింది. ఆంధ్రాలో కమలదళానికి అంత సీన్ లేదు. పోరంతా జగన్, చంద్రబాబుల మధ్యే ఉంటుంది కాబట్టి బాబు రెండవ లక్ష్యం నెరవేరడం ఆషామాషీ విషయమేమీ కాదంటున్నారు విశ్లేషకులు. అంతిమ విజయం ఎవరిదో తేలాలంటే మరో నాలుగు నెలలు వేచి ఉండాల్సిందేగా మరి!



## పాపం షర్మిల!

తన రాజకీయ కోరికల సాధనకు తెలంగాణను వేదికగా చేసుకుందామనే భారీ ప్రణాళికతో బరిలోకి దిగిన వై.ఎస్.షర్మిల రాజకీయానికి 'శుభం' కార్డు పడింది.

తనను తాను బాగా ఎక్కువగా ఊహించుకోవ డంతో, తెలంగాణ రాజకీయంలో ఇమడలేక పోయారు. వచ్చిరావడంతోటే, ముఖ్యమంత్రి పీఠంపై గురిపెట్టడం, అనుభవానికి మించిన మాటలు, విమర్శలు చేయడం, క్షణాల మీద పాదయాత్ర చేసేసి... అన్ని పార్టీల నేతలను విమర్శించడంతో... బుడగ తొందరగా పేలిపోయిందని పరిశీలకులు అంటున్నారు. నిజానికి, కాంగ్రెస్‌లోనే ఆమె చేరిఉంటే, డాక్టర్ వైఎస్ తనయగా ఆమెకు మంచి గౌరవం దక్కి ఉండేది. కానీ, జగన్‌ను చూసి ఆమె తెలంగాణ రాజకీయ సుడిగుండంలోకి దూకారు. చివరికి, పోటీచేయలేని స్థితికి షర్మిల రాజకీయం చేరుకుంది.

ఆమెకు ఇంకా రాజకీయ ఆశలు ఉంటే, ఆంధ్ర ప్రదేశ్ సరైన కార్యక్షేత్రం అని పలువురు వ్యాఖ్యాని స్తున్నారు. తన అన్న జగన్‌ని ఢీ కొనడం కష్టమను కుంటే, ఇక రాజకీయాల జోలికే వెళ్లకపోవడం ఉత్తమం అనే అభిప్రాయం కూడా వివిధ వర్గాల నుండి వ్యక్తమవుతోంది. ఇటు పుట్టినింటికీ, అటు మెట్టినింటికీ కాకుండా, పాపం రాజన్న బిడ్డ షర్మిల రెంటికీ చెడ్డ రేవడిగా మారిపోయిందన్న కామెంట్లు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి!



## చంద్రబాబును కలిసిన నెల్లూరు నేతలు

టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఇటీవల తిరుమల సందర్శనకు వచ్చినప్పుడు, తిరుపతిలో ఆయన్ను నెల్లూరు టీడీపీ నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్ర కలసి పలు విషయాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్రరెడ్డి, మాజీ మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి, శ్రీకాళహస్తి టీడీపీ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### తెలంగాణలో విజయంపై..
## కాంగ్రెస్ ఆనందోత్సాహాలు



తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో నెల్లూరు నగరంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈనెల 3న పెద్దఎత్తున సంబరాలు నిర్వహించాయి. నగరంలోని గాంధీబొమ్మ కూడలి వద్ద జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచారు. తొలుత, ఇందిరా భవన్‌లో ఉన్న ఇందిరాగాంధీ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకుడు ఫయాజ్ మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ అపూర్వ విజయం సాధించిందని, కాంగ్రెస్ పార్టీ పాలనలో ఇక తెలంగాణ అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ నాయకులు ఏటూరి శ్రీనివాసులురెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పర్తి గణేష్‌బాబు, ఫజులుద్దీన్, శ్రీధర్, సాయికుమార్, ఇర్ఫాన్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### 7 నుంచి ఢిల్లీలో..
## ఏబీవీపీ జాతీయ మహాసభలు

ఏబీవీపీ (అఖిల భారతీయ విద్యార్థి పరిషత్) 75 వసంతాల సందర్భంగా దేశంలోని అన్నిప్రాంతాల విద్యార్థులతో డిసెంబరు 7 నుంచి 10వ తేదీ దాకా ఏబీవీపి 69వ జాతీయ మహాసభలు నిర్వహించనున్నారని, ఏబీవీపీ ఆత్మకూరు కన్వీనర్ ప్రవీణ్ తెలిపారు. ఆమేరకు గోడపత్రికలను ఆయన ఈనెల 3న ఆత్మకూరులోని పలు కళాశాలల్లో ఆవిష్కరించారు. ఏబీవీపీ నగర కార్యదర్శి భరత్, విద్యార్థి నాయకులు జయంత్, ప్రశాంత్, కిషోర్. మహేష్, హరి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వేపల్లి మాజీ సర్పంచ్ కన్నుమూత

వెంకటాచలం మండలం సర్వేపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్, టీడీపీ నేత మందల శీనయ్య అనారోగ్యంతో ఈనెల 2వ తేది రాత్రి కన్నుమూశారు. ఆయన వయసు 79 సంవత్సరాలు. ఆ సమాచారం తెలుసుకున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కుంకాల దశరథ నాగేంద్రప్రసాద్, తెనాలి రమణయ్య, ఆకుల రమణయ్య, రాజేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## 3 రాష్ట్రాల్లో విజయం..బీజేపీలో సంబరం



ఇటీవల జరిగిన రాజస్థాన్, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో జిల్లాలోని బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శీపా వంశీధర్‌రెడ్డి పార్టీ కార్యకర్తలతో ఈనెల 3న సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రధాని మోడీ దేశంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు చేపట్టి అమలుచేస్తూ, మరోవైపు దేశాభివృద్ధికి నిరంతరం కృషిచేస్తూ సుపరిపాలన సాగిస్తున్నారని, అందుకే దేశప్రజలు ప్రధాని మోడీని, బీజేపీని ఎంతగానో ఆదరిస్తున్నారని అన్నారు. రానున్న ఆంధ్ర ఎన్నికల్లో కూడా ప్రజలు బీజేపీని ఆశీర్వదించి గెలిపించాలని వారు ఈ సందర్భంగా కోరారు. తొలుత అందరికీ స్వీట్లు పంచారు. కార్యాలయం వద్ద బాణసంచా వేడుకలతో సందడి చేశారు. ఈ సంబరాల్లో వంశీధర్‌రెడ్డితోపాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కర్నాటి ఆంజనేయరెడ్డి, నాయకులు గడ్డం విజయకుమార్, ఎరబోలు రాజేష్, బీజేపీ అనుబంధ సంఘాల నాయకులు, పెద్దసంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర పథకాలను పక్కదారిపట్టిస్తున్న వైకాపా



కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను రాష్ట్రంలోని వైకాపా ప్రభుత్వం పక్కదారిపట్టిస్తోందని, ఆ పథకాలు తమవిగా చెప్పుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ నాయకులు విమర్శించారు. ఇటీవల బీజేపీ ఆధ్వర్యంలో మండలకేంద్రమైన కలువాయిలో ప్రధాని ఉజ్వల యోజన పథకం కింద 30మంది లబ్దిదారులకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు మంజూరుచేశారు. ఈ కార్యక్రమంలో వెంకటగిరి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి ఎస్ఎస్ఆర్ నాయుడు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ప్రధాని మోడీ సారధ్యంలో కేంద్రప్రభుత్వం బడుగు బలహీనవర్గాల ప్రజలకు ఎన్నో రకాల సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తోందని, వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలువాయి మండల బీజేపీ కన్వీనర్ మల్లికార్జుననాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ కుట్రతోనే వీఆర్‌సిని మూసేశారు

- ఎస్ఎఫ్ఐ నాయకుల ధ్వజం




నెల్లూరు నగరంలో వందేళ్ల చరిత్ర కలిగిన విఆర్ కళాశాలను మూసివేయడం దారుణమని, కేవలం రాజకీయ కుట్రతోనే అంతటి చరిత్రాత్మకమైన కళాశాలను మూసివేశారని, దానిని వెంటనే తెరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా నేతలు ధ్వజమెత్తారు. విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరులోని కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ ఆందోళనలో విద్యార్థి నాయకులు మాట్లాడుతూ, విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో, వారి ఇబ్బందులు తీర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీహర్ష, శ్రీనివాసులు విమర్శించారు. నేటికీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇవ్వలేదని, జూనియర్ కాలేజీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయలేదని వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఆందోళనలో నాయకులు బాలాజీ, నరేంద్ర, సంతోష్, అశ్విన్, ఉదయ్, అజయ్, బాషా, సుమంత్, చరణ్, జీవన్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టరేట్ ముట్టడిని పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ దశలో పలువురు విద్యార్థి నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి సంతపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## ఎన్‌సిసి ఆధ్వర్యంలో.. ఘనంగా నౌకాదళ దినోత్సవం




డిసెంబరు 4న 52వ భారత నౌకాదళ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 3న నెల్లూరులోని వాత్సల్య అనాథ శరణాలయంలో ముందస్తు వేడుకలు నిర్వహించారు. 10-ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సిసి లెఫ్టినెంట్ కమాండర్, కమాండింగ్ ఆఫీసర్ వినయ్‌రామచంద్రన్ ఆదేశాలతో, ఎన్‌సిసి సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. చిన్నతనం నుంచే బాలబాలికలు దేశభక్తిని అలవరచుకోవాలని ఈ సందర్భంగా ఆయన బాలలకు సూచించారు. అనంతరం శరణాలయంలోని చిన్నారులకు దుస్తులు, మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి ఆఫీసర్లు సీవీ నాగరాజు, సూపరింటెండెంట్ ముకుందసాగర్, శివప్రసాద్, వెంకటేష్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## టూకీగా...



### సోమశిల డ్యామ్‌కు పెరిగిన వరదనీరు

తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో జిల్లాలోని సోమశిల జలాశయం నీటిమట్టం పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదనీటితో మంగళవారం (ఈనెల 5వ తేది) నాటికి 10వేల క్యూసెక్కుల నీరు చేరిందని, మొత్తంగా జలాశయంలో ఇప్పటికి 30.756 టీఎంసిల నీరుందని డ్యామ్ అధికారులు తెలిపారు.

### వెంకన్నపాళెం రోడ్డుకు గండి

తుఫాన్ ప్రభావంతో మనుబోలు మండలంలోని వెంకన్నపాళెం వద్ద రోడ్డుకు గండిపడింది. రోడ్డుపై వరదనీళ్ళు భారీగా ప్రవహిస్తుండడంతో పలు గ్రామాల ప్రజలు పడిన ఇబ్బందులు వర్ణనాతీతం. బద్దెవోలు, వెంకన్నపాళెం, కట్టుబడిపాళెం, కొలను కుదురు, పిడూరుపాళెం గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోవడంతో గ్రామస్తులు అవస్తలు పడ్డారు.

### జొన్నవాడలో..లక్ష బిల్వార్చన

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం.. జొన్నవాడ శ్రీ మల్లికార్జున సమేత కామాక్షితాయి దేవాలయంలో కార్తీకమాసం సందర్భంగా ఇటీవల శ్రీ మల్లికార్జునస్వామికి లక్ష బిల్వార్చన పూజలు నిర్వహించారు. పరమ శివునికి ప్రీతి పాత్రమైన మారేడు దళాలతో ఆలయ అర్చకులు స్వామివారిని పూజించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

### జమ్మవరంలో సచివాలయం తనిఖీ

అనుమసముద్రంపేట(ఏఎస్‌పేట) మండలంలోని జమ్మవరం గ్రామంలోని సచివాలయాన్ని ఇటీవల జడ్పీ సిఇఓ చిరంజీవి ఆకస్మికంగా తనిఖీచేసి రికార్డులు పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడుతూ, సచివాలయ ఉద్యోగులు పనితీరు మెరుగుపరచుకోవాలన్నారు. పంచాయతి కార్యదర్శి హరి, ఏఎన్ఎం సింధూర, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### జగదేవిపేటలో వరిపొలాల పరిశీలన

జిల్లా వ్యవసాయ సంచాలకులు రాజ్‌కుమార్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ విజయకుమార్‌లు ఇటీవల ఇందుకూరుపేట మండలం జగదేవిపేటలోని వరిపొలాలను పరిశీలించారు. పంటలకు తెగుళ్లు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై, లాభదాయకమైన సాగువిధానాలపై రైతులకు అవగాహన కలిగించారు.

### మైపాడులో పీహెచ్‌సీ తనిఖీ

ఇందుకూరుపేట మండలం మైపాడు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఇటీవల జిల్లా క్షయ నియంత్రణాధికారి షేక్ ఖాదర్‌వలీ తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. వైద్య సేవలను ఆరా తీసి, సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం అక్కడున్న ఆరుగురు క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. డాక్టర్ విజయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

### విడవలూరులో కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన

మండల కేంద్రమైన విడవలూరులోని పీఆర్ఆర్-వీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఇటీవల కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్‌సి శ్రీనివాసులు ఆధ్వర్యంలో కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన కలిగించారు. సాంకేతిక పరిజ్ఞానం బాగుంటేనే ఉద్యోగావకాశాలు లభిస్తాయని, ప్రతి విద్యార్థి తమ జ్ఞానాన్ని విస్తరించుకోవాలని చెప్పారు.

### సంగంలో బీఎల్‌ఓలకు సూచనలు

మండల కేంద్రమైన సంగం జడ్పీ హైస్కూల్‌లో ఇటీవల బిఎల్‌ఓలు నిర్వహించిన ప్రత్యేక శిబిరాన్ని తహశీల్దార్ నాగరాజు సందర్శించి బీఎల్‌ఓలకు తగు సూచనలిచ్చారు. 18 ఏళ్ళు నిండిన యువతీయువకుల ఓటు నమోదు చేసుకోవాలని చెప్పారు. ఆయన వెంట డెప్యూటీ తహశీల్దార్లు ప్రవీణ్‌కుమార్, అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఎర్రబల్లిలో కోడిపందెగాళ్ళ అరెస్ట్

కొండాపురం మండలంలోని ఎర్రబల్లి గ్రామశివార్లలో కోడిపందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు ఈనెల 3న దాడులు చేసి నలుగురు పందెంరాయుళ్ళను అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి రెండు పందెం కోడిపుంజులు, రూ.2100 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఖాజావలి చెప్పారు.





# ఎప్పుడు వానొచ్చినా ఇంతే!

- నరకంగా మారిన నగరం
- మురికినీళ్ల గుంటగా..మాగుంట లేఅవుట్
- అండర్‌బ్రిడ్జి జలమయం.. రాకపోకలు కట్
- ఈ దుస్థితి మారదా?..

**నెల్లూరు నగరంలో మాగుంట లేఅవుట్ ఎంతో ప్రధానమైనది. మినీబైపాస్‌రోడ్డు నుంచి కెవిఆర్ పెట్రోల్‌బంకు దాకా ఉన్న రోడ్డు ఎప్పుడూ వాహనాల రాకపోకలతో రద్దీగా ఉంటుంది. అయితే, అదేమి దురదృష్టమో తెలియదు కానీ, ఎప్పుడు వానొచ్చినా సరే..నెల్లూరులోని మాగుంట లేఅవుట్ అండర్‌బ్రిడ్జి కింద ఆ వర్షపునీరంతా నిలిచిపోయి వాహనాల రాకపోకలు ఆగిపోతుండడం సర్వసాధారణమైపోయింది. అందులోనూ ఇక భారీవానలు, తుఫాన్ వంటివి వస్తే పరిస్థితి ఎంత నరకయాతనగా ఉంటుందో చెప్పనలవి కాదు. ఇప్పుడు కూడా అంతే, ఏళ్ళు గడిచిపోతున్నా ఈ దుస్థితిలో ఎలాంటి మార్పు ఉండడం లేదు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ఆ వంతెన కింద నీళ్ళు నిలవకుండా శాశ్వత ప్రాతిపదికన చర్యలు చేపట్టకపోవడంతో అటు వాహనదారులు, ఇటు స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.**

తుఫాన్ దెబ్బకు, భారీవానల ధాటికి నెల్లూరు నగరమే ఒక మురుగు గుంటగా మారినవేళ.. ఇక మాగుంటలేఅవుట్ సంగతి ప్రత్యేకించి చెప్పనే అక్కరలేదు. అత్యంత సుందరముదనష్టంగా తయారైన ప్రాంతమేదంటే ఇప్పుడు నగరంలో మాగుంట లేఅవుటేనని చెప్పాలి. పెద్దపెద్ద షాపింగ్ మాల్స్, గొప్పగొప్ప భవంతులు, అన్నమయ్య సర్కిల్ నుంచి లేదా వరమహాలక్ష్మి వస్త్రాలయం వద్ద నుంచి అటు జిల్లా పోలీస్ కార్యాలయానికి లేదా డీకెడబ్ల్యు కాలేజీ దాకా వెళ్ళే ముఖ్యమైన రోడ్డు కూడా మాగుంట లేఅవుట్ మీదనుంచే పోతుంది. రేయింబవళ్ళు వాహనాల రద్దీతో ఉండే ఈ దారిలో రైల్వే అండర్‌బ్రిడ్జి ఉంది. వర్షాలొచ్చినప్పుడు ఎక్కడెక్కడి నీళ్ళన్నీ వచ్చి ఈ వంతెన కింద మడుగులు కట్టిఉండడంతో వాహనాల రాకపోకలు నిలిపివేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప, శాస్త్రపరిజ్ఞానం బాగా విస్తరించిన ఈ రోజుల్లో కూడా వంతెనల కింద నీళ్లు నిలవకుండా చేసే యంత్రాంగమే మనకు లేకపోవడం ఎంత దారుణమో చూడండి. మొన్నటి మూడురోజుల తుఫాన్‌లో మాగుంట లేఅవుట్ బ్రిడ్జి కింద నీటిప్రవాహం పెరిగి రోడ్డు చుట్టుపక్కలంతా నీళ్లు మడుగులు కట్టాయి. నీళ్ల ప్రవాహంతో ఈ అండర్‌బ్రిడ్జి నుంచి అటు మినీబైపాస్‌రోడ్డు దాకా ఒక సముద్రంలా కనిపించింది. వాహనాలను దారిమళ్ళించడం మినహా మరో గత్యంతరం లేదంటూ అధికారులు చేతులెత్తేయడంతో నగరంతో మాగుంట లేఅవుట్‌కు సంబంధాలు తెగిపోయాయి.

## ముందస్తు చర్యలేవీ?...

ఒకవైపు విద్యుత్ వ్యవస్థ కుప్పకూలిపోయి విద్యుత్ సరఫరా లేక పోవడంతో స్థానికులు పడిన అవస్తలు వర్ణనాతీతం. తుఫాన్‌ల సమయంలో భారీవానలు వస్తాయని తెలిసీ, ముందస్తు చర్యలన్నీ తీసుకుంటున్నామని అధికారులు గొప్పలు చెప్పుకుంటారే తప్ప, ఆచరణలో అవన్నీ నామ మాత్రమేనని, ఈ వానల్లో మురుగునీళ్ళ గుంటగా మారిన మాగుంట లేఅవుట్ అండర్‌బ్రిడ్జిని చూసినవారెవరికైనా తెలుస్తుంది. తుఫాన్ దెబ్బకు అనేకరోడ్లల్లో పెద్దపెద్ద చెట్లు కూడా పడిపోవడంతో, ఎటువైపుకు వెళ్ళాలన్నా వెళ్ళలేక ఆ మూడురోజులూ మాగుంట లేఅవుట్‌వాసులు పడిన ఇబ్బందులు అన్నిన్ని కావు. కనీసం ట్రంకురోడ్డుకో, లేదా కూరగాయల మార్కెట్‌కో వెళ్ళాలన్నా ఎటువైపూ దారిలేక ప్రజలు అవస్తలు పడుతున్నా, ఎవరూ పట్టించుకోలేదు. నగరంలోని ఆత్మకూరు బస్టాండు వద్ద, విజయమహల్ గేటు, విఆర్‌సిల వద్ద ఇలాంటి వంతెనలే ఉన్నాయి. అక్కడ కూడా ఇదే దుస్థితి. ఎంతకాలమిలా అవస్తలు పడాలి?.. ఏళ్ళ తరబడిగా ఈ బాధల నుంచి తమకు విముక్తి లేదా?.. అంటూ నగర ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉండనే ఉంటుంది. ఆ దిశగా ప్రయత్నాలు సాగిస్తే కదా!.. జిల్లా ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ నిపుణులు ఇకనైనా ఈ సమస్యపై మనసుపెడితే, అండర్‌బ్రిడ్జిల వద్ద నీళ్ళు నిలవకుండా చేయడం పెద్ద పనికాదు. ఎంతకాలం గడిచినా..అటు పాలకులు కానీ, ఇటు అధికారులు కానీ.. ఆ పని చేయకపోవడమే బాధాకరమని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.







## ‘లాయర్’ కార్యాలయం.. జలమయం!

నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో ఉన్న ‘లాయర్’ పత్రిక కార్యాలయం తుఫాన్‌లో కురిసిన భారీవర్షాలకు జలమయమైంది. రోడ్డు మీదంతా నీళ్ళ ప్రవాహం ఒక సముద్రంలా కనిపించిది. ఈ ప్రాంతంలోని ఇళ్ళు, దుకాణాలు, షాపింగ్‌మాల్స్ వగైరాలన్నీ మూడురోజుల పాటు నీళ్ళలో తడిసిముద్దయ్యాయి. రోడ్డుపక్కనున్న చెట్లు కూలిపోవడం, విద్యుత్ స్తంభాలు నేలవాలడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చుట్టూ నీళ్లు నిలిచిపోవడం, రోడ్డుమీద ప్రవాహవేగంతో నీళ్లు పారుతుండడంతో అటు అండర్ బ్రిడ్జి వద్దనుంచి ఇవతల మినీబైపాస్‌రోడ్డు వరకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అండర్‌బ్రిడ్జి ప్రాంతానికివచ్చే అన్నిదారులు మూసుకుపోవడంతో దుకాణాలు మూతపడ్డాయి. ‘లాయర్’ పత్రికకూ అంతరాయం కలిగింది. సెల్‌ఫోన్ నెట్‌వర్క్‌లు కూడా ఈ తుఫాన్ దెబ్బకు అయిపులేకుండా పోయాయి. దీంతో సమాచార వ్యవస్థ చిన్నాభిన్నమైంది. ఇంటర్‌నెట్ నెట్‌వర్క్ కూడా పూర్తిస్థాయిలో దెబ్బతినడంతో సంబంధిత సిబ్బంది రెండురోజుల పాటు కష్టపడి దానిని బాగుచేశారు. మాగుంట లేఅవుట్ ప్రాంతమంతా విద్యుత్ సరఫరా లేక ప్రజలు అవస్తలు పడుతున్న సమయంలో విద్యుత్ సిబ్బంది హుటాహుటిన వచ్చి, గంటల తరబడి శ్రమించి ఈ ప్రాంతంలో విద్యుత్‌ను పునరుద్ధరించడం అభినందనీయం. కార్పొరేషన్ అధికారులు కూడా చొరవతీసుకుని అండర్‌బ్రిడ్జి వద్ద ఇంజన్లుపెట్టి రోజంతా నీళ్లు తోడించడంతో ఎట్టకేలకు రెండురోజుల తర్వాత పరిస్థితి ఒక కొలిక్కివచ్చింది.




జననం: 05.08.1957 నిర్యాణం : 25.11.2023

## ఉత్తరక్రియలు (తేదీ మార్పు)

ప్రతిభాశాలి, సౌమ్యశీలి, ఆతిథ్య రంగంలో సంచలనాలు సృష్టించిన ధీశాలి
మానవీయ విలువలున్న స్నేహశీలి

**శ్రీ అల్లారెడ్డి రవికుమార్‌రెడ్డి గారు**

(S/o లేట్ అల్లారెడ్డి శ్యామసుందరరెడ్డి)
తే.25.11.2023ది శనివారం స్వర్గస్థులైనారు.

వారి ఉత్తరక్రియలు తేది 09.12.2023 గురువారం మ॥ 12 గంటలకు నెం.146, డా. రాధాకృష్ణన్ రోడ్డు, మైలాపూర్, చెన్నైలోని సవేరా హోటల్, సమావేశ్ మందిర్‌లో జరుగును. కావున తెలియజేయడమైనది.

- కుటుంబ సభ్యులు


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com